# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :61 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 26-04-2024 | పేజీలు:4 వెల: 2.00


## కోటక్ మహీంద్రాపై ఆర్‌బిఐ కొరడా

ముంబై,రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరో సంచలన నిర్ణయం తీసుకున్నది. ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ అయిన కొటాక్ మహీంద్రా బ్యాంక్ ఆన్ లైన్ సేవలపై ఆంక్షలు విధించింది. ఈ మేరకు బుధవారం ఆర్బీఐ ఆదేశాలు జారీ చేసింది. కొటాక్ మహీంద్రా బ్యాంక్ ఆన్ లైన్ సేవలకు సంబంధించి.. కొత్తగా ఎలాంటి క్రెడిట్ కార్డులు జారీ చేయటానికి వీల్లేదు. మొబైల్ బ్యాంకింగ్ సేవల కింద.. కొత్త కస్టమర్లను ఆన్ బోర్డ్ చేయకూడదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశించింది. కొటాక్ మహీంద్రా బ్యాంక్ గత రెండు సంవత్సరాలుగా.. అంటే 2022, 2023 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి.. ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ గవర్నరెన్స్, ఐటీ రిస్క్ కేటగిరీల్లో లోపాలు ఉన్నట్లు ఆర్బీఐ గుర్తించింది. వరసగా రెండేళ్లపాటు ఈ లోపాలు బయటపడటంతో ఆంక్షలు విధించింది. ఈ క్రమంలో ఆన్‌లైన్ ద్వారా కస్టమర్లను తీసుకోవటం, ఆన్‌లైన్ ద్వారా క్రెడిట్ కార్డులను జారీ చేయటాన్ని నిలిపివేసింది. ఏప్రిల్ 23వ తేదీ వరకు ఉన్న కస్టమర్లకు ఎలాంటి ఇబ్బంది ఉండదని.. యథావిధిగా లావాదేవీలు కొనసాగించవచ్చని.. వారి సేవలకు

## మోదీ, రాహుల్ ప్రసంగాలపై ఈసీ అసహనం..

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఎన్నికల సంఘం తాజాగా నోటీసులు ఇచ్చింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి విద్వేషపూరిత ప్రసంగాలతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ఫిర్యాదులు రావడంతో రెండు పార్టీలకు ఎన్నికల సంఘం తాజాగా నోటీసులు పంపింది ఏప్రిల్ 29వ తేదీ ఉదయం 11 గంటల్లోగా దీనిపై వివరణ ఇవ్వాలంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేని ఈసీ ఆదేశించింది. ఈ సందర్భంగా మోదీ, రాహుల్ ప్రసంగాలపై ఈసీ అసహనం వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులు ఎన్నికల నియమావళిని అనుసరిస్తున్నాయా లేదా అన్నది ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని, అది పార్టీ బాధ్యత అని తెలిపింది. ముఖ్యంగా స్టార్ క్యాంపెయినర్ల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉన్నత స్థాయిల్లో ఉన్న



వ్యక్తుల ప్రచార ప్రసంగాలు మరింత తీవ్రమైన పరిణామాలకు దారి తీసే ప్రమాదం ఉంటుందని ఈసీ తన నోటీసుల్లో పేర్కొంది.

## మెట్రో రైల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి హల్‌చల్..

### బీఆర్ఎస్‌కు మద్దతుగా ప్రచారం

హైదరాబాద్ : మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎక్కడ ఉంటే అక్కడ జోష్ ఉంటుంది. తనదైన హాస్య చతురోక్తులు, ఆటపాటలతో సందడి చేస్తుంటారు. యూత్‌లో ఉత్సాహాన్ని నింపుతుంటారు. తాజాగా మెట్రో రైల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రయాణించి హల్‌చల్ చేశారు. మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హుషారుగా ఓటర్లను దగ్గరికి తీసుకుంటూ కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాగా, మల్లారెడ్డితో సెల్ఫీలు దిగేందుకు ప్రయాణికులు ఆసక్తి చూపారు. మల్లారెడ్డి వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఉన్నారు.




## పెద్దపల్లి జిల్లా బీజేపీలో భగ్గుమన్న విభేదాలు..

పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా బీజేపీ పార్టీలో ఆదిపత్య పోరు కొనసాగతున్నది. ఎన్నికల నామినేషన్ సందర్భంగా తమ నేతలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ బీజేపీ నేతలు బహాబాహీకి దిగారు. వివరాల్లోకి వెళ్తే.. బీజేపీ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డ్ వద్ద జిల్లా అధ్యక్షుడు సునీల్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల వర్గీయులు అడ్డుకున్నారు.మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి పేరు, కాసిపేట లింగయ్య పేర్లు చెప్పకుండానే ప్రదర్శన ప్రారంభించడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. తమ నేతలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆగ్రహించిన గుజ్జుల వర్గీయులు ఘర్షణకు దిగారు. ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. దీంతో సునీల్ రెడ్డి రామకృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య పేర్లు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.



## ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోరం.. లారీని కారు ఢీకొట్టడంతో చెలరేగిన మంటలు

హైదరాబాద్ : ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం జరిగింది. ఆగివున్న లారీని వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో కారులో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాద ఘటన పటాన్‌చెరు ముత్తంగి వద్ద ఉన్న ఓఆర్ఆర్ ఎగ్జిట్ -3 వద్ద గురువారం ఉదయం చోటు చేసుకుంది.ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధమైంది. లారీకి కూడా మంటలు వ్యాపించాయి. లారీలో ఉన్న వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. అయితే కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు సజీవదహనం అయ్యారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.



## మే 27న వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

హైదరాబాద్ : వరంగల్ -ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం విడుదల చేసింది. ఈ ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ మే 2వ తేదీన జారీ కానుంది. మే 2 నుంచి 9వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 10వ తేదీన నామినేషన్లను పరిశీలించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ మే 13. ఈ ఉప ఎన్నికకు మే 27వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు.27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. జూన్ 5వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. వరంగల్ %-% ఖమ్మం %-% నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి.. 2023 అసెంబ్లీ




ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో ఈ పట్టభద్రుల నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు.. జవాన్ మృతి

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో మరోసారి కాల్పుల మోత మోగింది. జవాన్లకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో ఒక జవాను ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళ్తే.. దంతెవాడ జిల్లా బార్సూర్ పరిధిలోని హందవాడ, హితవాడలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్‌డ్ గార్డ్(డీఆర్‌జీ) పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. పోలీసుల కదలికలను పసిగట్టిన మావోయిస్టులు.. ఒక్కసారిగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో దంతెవాడ డీఆర్‌జీ కానిస్టేబుల్ జోగరాజ్ కర్మ మృతి చెందాడు. మరో కానిస్టేబుల్ పరశురామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కానిస్టేబుల్ పరశు రామ్‌ను చికిత్స నిమిత్తం రాయ్‌పూర్‌కు తరలించారు. ఎదురుకాల్పులు చోటు చేసుకున్న ప్రాంతంలో బలగాల కూంబింగ్ కొనసాగుతోంది.



## సీఎం కుర్చీ గౌరవాన్ని కాపాడు.. రేవంత్‌కు హరీశ్‌రావు చురకలు

మెదక్ : సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఏది పడితే అది మాట్లాడితే నవ్వుల పాలవుతావ్. ఇజ్జత్, మానం పోతది.. చివరకు కుర్చీకున్న గౌరవం కూడా పోతది.. సీఎం కుర్చీ గౌరవాన్ని కాపాడు అని రేవంత్‌కు హరీశ్‌రావు చురకలంటించారు. మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ రోడ్ షోలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు.మెదక్ జిల్లా మన గులాబీ జెండాకు అడ్డా. ఈ గడ్డ మీద ఇంకో పార్టీ గెలవలేదు. ఈ 25 ఏండ్లలో ఎంపీగా బీఆర్ఎస్ పార్టీనే గెలిచింది. రేపు కూడా మెదక్‌లో గెలిచేది బీఆర్ఎస్ పార్టీనే. నిన్న సీఎం వచ్చి కేసీఆర్ ఈ పదేండ్లలో ఏం అభివృద్ధి చేయలేదు అని మాట్లాడిండు. నువ్వు మెదక్‌లో నామినేషన్ వేసేందుకు వచ్చావంటే అది కేసీఆర్ అభివృద్ధి వల్లే. మెదక్‌ను జిల్లా కేంద్రం చేయకపోతే ఇక్కడ నామినేషన్ వేసేవాడివా..? సంగారెడ్డిలో వేస్తుండే. ఈ జిల్లా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చింది కేసీఆర్. మెదక్‌లో కలెక్టరేట్ కట్టిండు కాబట్టి నువ్వు వచ్చినవ్. మీ అభ్యర్థి తరపున నామినేషన్ వేశావ్. నిన్ను మెదక్‌కు రప్పించిన ఘనత ఈ గులాబీ జెండాదే అని హరీశ్‌రావు తెలిపారు.మెదక్‌ను ఇందిరా గాంధీ అభివృద్ధి చేసిండు అని



రేవంత్ అంటుండు. అబద్దాలు చెబితే అతికేలా ఉండాలి. బీహెచ్‌ఈఎల్‌ను ఇందిరాగాంధీ తెచ్చిందన్నాడు. బీహెచ్‌ఈఎల్ 1952లో వచ్చింది. ఇందిరాగాంధీ ఎంపీ అయింది 1980లో. రేవంత్ రెడ్డి స్క్రిప్ట్ రైటర్ కూడా సరిగాలేడు. ఏది మాట్లాడితే అది నవ్వుల పాలు అవుతావ్.. ఇజ్జత్ మానం పోతది. చివరకు కుర్చీకున్న కూడా పోతుంది.. కుర్చీ గౌరవాన్ని కాపాడు అని హరీశ్‌రావుకు చురకలంటించారు.

## పీవీసీ పైప్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం

ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కాళింది కుంజ్ సమీపంలోని దోభీ ఘాట్ వద్ద ఓ పీవీసీ పైప్ తయారీ ఫ్యాక్టరీలో గురువారం ఈ దుర్ఘటన జరిగింది. అగ్నిప్రమాదంతో ఫ్యాక్టరీ నుంచి పొగ ఆ ప్రాంతమంతా వ్యాపించింది.ఐదు అగ్నిమాపక యంత్రాలను ఘటనా స్థలానికి అధికారులు రప్పించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనకు కారణాలు, ప్రాణ, ఆస్తినష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా వెలుగుచూడలేదు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడవుతాయని అధికారులు చెబుతున్నారు.



## 2024- కాంగ్రెస్ మేనిఫెస్టోలో వారసత్వ పన్ను ఊసే లేదు : జైరాం రమేష్

2024 : కాంగ్రెస్ మేనిఫెస్టోలో వారసత్వ పన్ను గురించి ఎలాంటి ప్రస్తావన లేదని సీనియర్ కాంగ్రెస్ నేత జైరాం రమేష్ స్పష్టం చేశారు. 1985లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ వారసత్వ పన్ను రద్దు చేశారని చెప్పారు.
వారసత్వ పన్ను తమ మేనిఫెస్టోలో లేదని, ఇది తమ అజెండాలోనూ లేదని జైరాం రమేష్ తేల్చిచెప్పారు. తామెన్నడూ వారసత్వ పన్ను గురించి మాటమాత్రం ప్రస్తావించలేదని అన్నారు. తమ మేనిఫెస్టోలో సంపద పున:పంపిణీ గురించి పొందుపరిచామని ప్రధాని నరేంద్ర మోదీ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.50 పేజీల తమ మేనిఫెస్టోలో సంపద పున:పంపిణీ గురించి ప్రస్తావన ఎక్కడ ఉందో వెల్లడించాలని తాను మోదీకి సవాల్ విసురుతున్నానని జైరాం రమేష్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ కాంగ్రెస్ మేనిఫెస్టో గురించి అవాస్తవాలు మాట్లడుతున్నారని మండిపడ్డారు.



## ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావాలని.. కొండగట్టు అంజన్నకు 116 కొబ్బరికాయలు

జగిత్యాల : ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పు మే 6వ తేదీకి వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమెకు బెయిల్ రావాలని కోరుతూ కొండగట్టు ఆంజనేయ స్వామికి 116 కొబ్బరి కాయలు కొట్టారు. బోధన్‌కు చెందిన శేఖర్, శంకర్ కలిసి కొండగట్టు అంజన్నకు కొబ్బరికాయలు కొట్టి.. కవితకు బెయిల్ రావాలని ప్రార్థించారు.రౌస్ అవెన్యూ కోర్టులో బుధవారం ఈడీ తరఫున జోహెబ్ హుస్సేన్ వాదనలు వినిపిస్తూ కోర్టు అనుమతితోనే నిందితులు అప్రూవర్లుగా మారారని, వారిని అనుమానించడం కోర్టు నిర్ణయాన్ని తప్పుబట్టడమేనన్నారు. ఈడీ వాదనలపై రిజాయిండర్ లిఖితపూర్వకంగా ఇస్తామని కవిత తరఫు న్యాయవాది నితీశ్‌రాణా తెలిపారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు బెయిల్ పిటిషన్‌పై మే 6న తీర్పు వెల్లడించనున్నట్టు తెలిపింది.



## అమేథిలో రాహుల్.. రాయ్‌బరేలీలో ప్రియాంక పోటీ..?

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని అమేథి, రాయ్‌బరేలీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎవరు పోటీ చేస్తారనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. ఈ ఉత్కంఠకు మరో నాలుగైదు రోజుల్లో తెరపడే అవకాశం ఉంది. ఈ స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్టానం ఏప్రిల్ 30వ తేదీ తర్వాత అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. అయితే అమేథి నుంచి రాహుల్ గాంధీ, రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక గాంధీ వాద్రా పోటీ చేస్తారని జోరుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ఊహాగానాలకు తెరపడాలంటే నాలుగైదు రోజులు ఆగాల్సిందే.

అయితే రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్ నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడ ఏప్రిల్ 26వ తేదీన పోలింగ్ జరగనుంది. అదే రోజున అమేథి, రాయ్‌బరేలీ స్థానాల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. వయనాడ్‌లో పోలింగ్ ప్రక్రియ ముగియగానే అమేథీ, రాయ్‌బరేలీ ఎంపీ స్థానాలపై అన్నాచెల్లెళ్లు దృష్టి సారించనున్నట్లు సమాచారం.

### అయోధ్య బాలరాముడి దర్శనానికి అన్నాచెల్లెళ్లు..!

అమేథి, రాయ్‌బరేలీ ఎంపీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు చివరి తేదీ మే 3. చివరి తేదీకి రెండు రోజుల ముందు రాహుల్, ప్రియాంక నామినేషన్లు వేసే అవకాశం ఉంది. ఇక నామినేషన్ల దాఖలు కంటే ముందు.. అన్నాచెల్లెళ్లు అయోధ్య బాలరాముడిని దర్శించుకునే అవకాశం ఉందని జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ ఏడాది జనవరి 22న అయోధ్యలో నిర్వహించిన బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉన్న విషయం విదితమే.



రాహుల్ గెలిచేనా..? తల్లి విజయాన్ని ప్రియాంక కొనసాగించేనా..?

కాంగ్రెస్‌కు పట్టున్న రాయ్‌బరేలీ నుంచి సోనియా గాంధీ పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించిన సంగతి తెలిసిందే. 2004 నుంచి 2019 వరకు సోనియానే గెలుపొందారు. ఇటీవల సోనియా రాజ్యసభకు ఎన్నికయ్యారు. దీంతో రాయ్‌బరేలీ నుంచి సోనియా కూతురు ప్రియాంక బరిలోకి దిగనున్నట్లు సమాచారం. అమేథిలో 2004 నుంచి వరుసగా మూడుసార్లు రాహుల్ ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో బీజేపీ నాయకులు స్మృతి ఇరానీ చేతిలో రాహుల్ ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో రాహుల్ వయనాడ్ నుంచి గెలుపొందారు.

## సంపాదకీయం

**శుక్రవారం 26-04-2024**

# ఆదుకునే తీరిదేనా?

కరువు కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతున్న కర్ణాటకను ఆదుకునేందుకు ఉదారంగా ముందుకు రావాల్సింది పోయి, కరువు నిధులను బిగబట్టుకు కూర్చున్న భూమిని మోడీ ప్రభుత్వ తీరు గర్హణీయం. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల పట్ల కేంద్రం అనుసరిస్తున్న వివక్ష వైఖరికి ఇది పరాకాష్ట.గత 122 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా 73 శాతం వర్షపాత లోటు గత ఏడాది చోటుచేసుకోవడం, ఎనిమిదేళ్లుగా వెంటాడుతున్న వర్షాభావం, పాలకుల నిర్లక్ష్యం వెరసి కర్ణాటకను తీవ్ర దుర్భిక్షంలోకి నెట్టాయి. గత ఏడాది 236 మండలాలకుగాను 223 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారంటేనే దీని తీవ్రత అర్థమవుతుంది. కోటి 18 లక్షల 62 వేల ఎకరాల్లో పొలాలు నెర్రెలివ్వడంతో రూ.35,162 కోట్ల మేర పంటనష్టం వాటిల్లింది. జాతీయ విపత్తు సహాయక నిధి (ఎన్‌డిఆర్‌ఎఫ్) కింద రూ.18,171 కోట్లు కర్ణాటక ప్రభుత్వం కోరితే,, కరువు బృందాల యాత్రలు, కమిటీల నివేదికల పేరుతో కాలయాపన చేయడం తప్ప కేంద్రం చిల్లి గవ్వ కూడా విదల్చలేదు. ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ (ఐఎంసిటి) రాష్ట్రాన్ని సందర్శించి, కరువును అంచనా వేసి నింపాదిగా నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక పై కేంద్రం వెంటనే కదిలిందా అంటే అదీ లేదు. ఇది ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యవే. కరువు నిధులు కేంద్రం దయాదాక్షిణ్యాలతో ఇచ్చే భిక్ష కాదు. రాష్ట్రాల హక్కు. భారత రాజ్యాంగంలోని 14, 21 అధికరణల ప్రకారం పౌరులకు హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులో భాగంగానే దీనిని చూడాలి. ఈ విషయంలో కర్ణాటక ప్రభుత్వం చేస్తున్న వాదన సహేతుకమైనదనడంలో ఎలాంటి సందేహం లేదు. రాష్ట్ర రాజధాని బెంగళూరుతో సహ రాష్ట్రంలో చాలా ప్రాంతాలు గుక్కెడు నీటి కోసం కటకటలాడుతున్నాయి. నిధుల కోసం కర్ణాటక అభ్యర్థించి అయిదు మాసాలైనా కేంద్రం నుంచి కించిత్ కూడా స్పందన లేదు. వేరే గత్యంతరం లేని స్థితిలోనే కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ఇంతకాలం దీనిని పట్టించుకోనివారు వారం రోజులు గడువు ఇవ్వండి పరిష్కరించేస్తామని కోర్టుకు చెప్పడం వింతగా ఉంది. ఫెడరల్ వ్యవస్థలో తలెత్తే వివాదాలన సమరస్యంగా పరిష్కరించుకోవాలని సర్వోన్నత న్యాయస్థానంచే మరో సారి చెప్పుకునే పరిస్థితి ఎందుకొచ్చింది? దీనికి మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలి. కేంద్రం నిధులివ్వడం లేదు కాబట్టి తానేమి చేయలేనని చేతులెత్తేయడం కాకుండా అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించి కరువు పీడిత ప్రాంత ప్రజలను ఆదుకోవడానికి సిద్ధరామయ్య ప్రభుత్వం సత్వరవే కదలాలి.గత డిసెంబర్‌లో వరదలు ముంచెత్తడంతో తమిళనాడు తీవ్రంగా నష్టపోయింది. జాతీయ విపత్తుగా ప్రకటించి, రూ.7,033 కోట్లు మధ్యంతర నిధులు, రూ.12,659 కోట్లు శాశ్వత సహాయ నిధిని విడుదల చేయాలని తమిళనాడు ప్రభుత్వం కోరినప్పుడు కూడా కేంద్రం ఇదే విధమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను శత్రువులుగా చూస్తే దోరణి కర్ణాటక, తమిళనాడు, కేరళ సహా అనేక రాష్ట్రాల విషయంలో కళ్లకు కడుతోంది. కేంద్ర ప్రభుత్వ ఈ ధోరణి సమాఖ్య వ్యవస్థకే గొడ్డలిపెట్టు.రాజ్యాంగంలోని ఒకటవ అధికరణలో 'యూనియన్ ఆఫ్ స్టేట్స్' అని చెప్పడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలంగా ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు కోరుకున్నారు. కానీ, దీనికి విరుద్ధంగా మోడీకి వ్యతిరేకంగా బిజెపి ప్రభుత్వ పనులు ఉన్నాయి. పన్నుల పంపిణీ మొదలు, గ్రాంట్ %-% ఇన్ -ఎయిడ్, కరువు సహాయం, నీటి వనరుల ప్రాజెక్టులకు అనుమతులు దాకా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై కేంద్రం అంతులేని వివక్షను ప్రదర్శిస్తోంది. పన్నుల ఆదాయంలో ఉత్తర ప్రదేశ్‌కు వందకు 46 శాతం ఇస్తున్న కేంద్రం, కేరళకు 21 శాతం, కర్ణాటకకు 13 శాతం మాత్రమే ఇస్తున్నది. 15వ ఫైనాన్స్ కమీషన్ పన్ను బదలాయింపు ఫార్ములాను మార్పు చేయడం వల్ల కేరళ, కర్ణాటక సహా చాలా రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. దేశం %-% ఒకే పన్ను పేరుతో తీసుకొచ్చిన ఒకే 'జిఎస్‌టి' వల్ల రాష్ట్రాలు రూ.3 లక్షల కోట్లు మేర నష్టపోయాయి. ఒక్క మన రాష్ట్రమే రూ.30 వేల కోట్లు దాకా నష్టపోయింది. కేంద్ర %-% రాష్ట్ర ప్రభుత్వ పనితీరును దెబ్బతీస్తున్న మోడీ విధానాలకు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో కేరళ ముఖ్యమంత్రి పినరయిన్, ఆ రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆందోళనకు దిగారు. ఆర్థిక వనరుల విషయంలో జరుగుతున్న అన్యాయం, సమాఖ్య వ్యవస్థకు వాటిల్లుతున్న ప్రమాదంపై చర్చ జరగలేదు. సరిగ్గా ఆ కర్ణాటక సిఎం సిద్ధరామయ్య సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఢిల్లీ వేదికగా ఆందోళన చేపట్టింది. బలమైన కేంద్రం, బలహీనమైన రాష్ట్రాలు ఇదే సంఘ్పరివార్ విధానం. అంతిమంగా ఇది నియంతృత్వానికి దారితీసే ప్రమాదముంది..దీనికి బ్రేక్ వేయాలంటే ఓటుతో మోడీ ప్రభుత్వంపై వేటు వేయాలి.

# అగ్గి రాజేయుద్దు!



పశ్చిమాసియా నేడు పెను యుద్ధ విపత్తు అంచున ఉన్నది నిజం. దీనికి అగ్గి రాజేసే పని చేయొద్దని పశ్చిమ దేశాల ప్రభుత్వాలు ఇజ్రాయిల్‌కు విజ్ఞప్తి చేశాయి. ఇటువంటి పై విజ్ఞప్తుల వల్ల ప్రయోజనం ఉండదు. దీనికి కచ్చితంగా అంగీకరించేలా యుద్ధోన్మాది నెతన్యాహు మెడలు వంచాలి. గత వారాంతంలో 300 డ్రోన్లు, క్షిపణులతో తమపై దాడి చేయడం ద్వారా ఇరాన్ కవ్వింపు చర్యకు పాల్పడిందని ఇజ్రాయిల్ నిందిస్తోంది. సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇజ్రాయిల్ కాన్సులెట్‌లో ఇద్దరు జనరల్స్‌తో సహా 13 మంది సైనికాధికారులు, దౌత్యలను వైమానిక దాడి ద్వారా చంపేసిన తన అరాచక చర్య గురించి ఇజ్రాయిల్ మాట్లాడలేదు.

దానిని వెనకేసుకొస్తున్న అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇతర పశ్చిమ దేశాలు ఆ ఊసేత్తవు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం డమాస్కస్‌లో కాన్సులెట్‌పై దాడి ఇరాన్‌పై జరిగిన దాడే అవుతుంది. ఇజ్రాయిల్ సాగించిన అరాచక చర్యను మాటమాత్రంగా కూడా ఖండించలేదు ఈ దేశాలు ఇరాన్ ప్రతీకార చర్యను మాత్రం వెంటనే ఖండించాయి. డమాస్కస్‌లో జరిగిన దాడిలో 13 మంది ఇరానీ అధికారులు మరణించారు. దౌత్య కార్యాలయం పూర్తిగా ధ్వంసమైంది. ఇరాన్ ప్రతీకార చర్యలో ఎలాంటి ప్రాణ నష్టం కానీ, విధ్వంసం కానీ చోటుచేసుకోలేదు.ఇరాన్ ఏదో అకస్మాత్తుగా తీసుకున్న చర్యకాదు. కొన్ని గంటల ముందే నోటీసు ఇచ్చింది. తన డ్రోన్లను ఇజ్రాయిల్ నిర్వీర్యం చేస్తుందని తెలుసు. ప్రతీకార చర్య తరువాత కాన్సులేట్‌పై దాడికి వన్‌టైమ్ పనిష్మెంట్ పూర్తయిందని, సిఫార్సు గనుక ఇజ్రీల్ మళ్లీ దాడి చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ఇరాన్‌ను ముగ్గులోకి లాగడం ద్వారా దీనిని ప్రాంతీయ యుద్ధంగా మార్చాలని ఇజ్రాయిల్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే డమాస్కస్‌లో కాన్సులెట్‌పై దాడి చేసింది. ఇరాన్‌ను దుష్ట రాజ్యంగా పశ్చిమ దేశాలు చిత్రిస్తున్నాయి నిజానికి ఈ ప్రాంతంలో దుష్ట రాజ్యం ఏదైనా ఉన్నదీ అంటే అది ఇజ్రాయిలే.ఇరాన్ డ్రోన్ దాడిని ఇజ్రాయిల్‌తోబాటు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ అడ్డుకున్నాయని బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ కెమరాన్ గొప్పగా చెప్పుకున్నారు. ఇజ్రాయిల్‌కు పలు అంచెల భద్రత కల్పిస్తున్న ఈ దేశాలు గాజాలో ప్రజలను రక్షించడానికి ఎలాంటి రక్షణ ఎందుకు కల్పించలేదు? పశ్చిమ దేశాల కపట వైఖరికి ఇదొక నిదర్శనం.లెబనాన్, సిరియా, ఇరాక్‌లపై పలుమార్లు దాడులు చేసి, ఇరాన్‌ను రెచ్చగొట్టి, మధ్య ప్రాచ్యంలో సంఘర్షణలను పెంచడం ద్వారా అమెరికా, పశ్చిమ దేశాల నుంచి మరింత సాయం పొందడం, దేశీయంగా తన అధికారం కోసం నెతన్యాహు ఎత్తులు వేస్తున్నారు. యుద్ధం ఆగితే నెతన్యాహు నేతఅత్వంలోని మితవాద సంకీర్ణాన్ని గద్దె దింపేందుకు సిద్ధంగా ఉన్న ఇజ్రాయిలీలు ఇప్పటికే ఆందోళనలు చేస్తున్నారు. అమాయకులను ఊచకోత కోయడం మినహా, బందిలందరినీ విడిపిస్తానని, హమాస్ నాయకత్వాన్ని నాశనం చేస్తానని పెట్టుకున్న యుద్ధ లక్ష్యాలేవీ నెరవేర్చలేదని, దేశాన్ని అప్రతిష్టపాల్జేస్తున్నారన్న ఆగ్రహం ఇజ్రాయిలీయుల్లో వ్యక్తమవుతోంది. రంజాన్ సందర్భంగా నైనా గాజాలో కాల్పుల విరమణకు పిలుపు నిస్తూ ఐరాస భద్రతా మండలి అత్యధిక మెజారిటీతో తీర్మానం చేసినప్పటికీ, ఇజ్రాయిల్ తన దాడులను తీవ్రతరం చేసింది. ఓటింగ్‌కు దూరంగా ఉండండి, అమెరికా తీర్మానం ఆమోదానికి అనుమతించినా ఇజ్రాయిల్ తీరులో మార్పు లేకపోవడం అమెరికా, పశ్చిమ దేశాల గుడ్డి మద్దతు ఫలితమే. నెతన్యాహు యుద్ధాలపై లాటిన్ అమెరికా దేశమైన నికరాగ్వా ఐసిసి బోనులో నిలబెట్టినా, పశ్చిమ దేశాల ఒళ్లతో శిక్షించలేని దుస్థితిలో ఉంది.దౌత్యపరంగా తటస్థం అంటూనే పెగాసస్ తదితర స్పైవేర్‌లతో ఇజ్రాయిల్‌తో అల్లుకున్న మితవాద బంధాన్ని మోడీ సర్కారు కొనసాగిస్తోంది. ఇంత చేస్తున్నా ఇరాన్ సంయమనం పాటిస్తూనే ఇజ్రాయిల్ నౌకలో ఉన్న భారతీయులు 17 మందిని కలుసుకోవడానికి అనుమతించారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి వస్తున్న పాలస్తీనా అనుకూల వైఖరిని విడనాడడం ద్వారా యూదు దురహంకారానికి మద్దతు ఇవ్వడం దేశానికి ప్రమాదకరం. నౌకలో ఉన్న వారిని త్వరగా స్వదేశానికి తరలించేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలి. అమెరికా తొత్తుగా మారకుండా స్వతంత్ర వైఖరిని తీసుకోవాలి. పాలస్తీనాపై దాష్టీకానికి ఇప్పటికైనా ముగింపు పలకాలి. పశ్చిమ దేశాలు ఇజ్రాయిల్‌కు ఆయుధాలు అందించడం మానాలి.

# కెసిఆర్ వితండవాదం !



హైదరాబాద్,తప్పులెన్ను వారు తమ తప్పులెరగరు..అని శతకకారుడు ఎప్పుడో చెప్పాడు. అది కెసిఆర్ విషయంలో బాగా పనికి వస్తుంది. ఎన్నో తప్పులు చేసినా..కనీసం ఒక్కటయినా ఒప్పుకోవడానికి ఆ మహానుభావుడు సిద్దంగా లేదు. అందులో ప్రధానమైనదే ఫోన్ ట్యాపింగ్ అంశం. మొత్తానికి ఫోన్ ట్యాపింగ్‌తో తమకు సంబంధం లేదని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఒక్కముక్కలో తేల్చేశారు. పోలీసులు విధి నిర్వహణలో భాగంగా చేసే పనికి తమకు సంబంధం లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ సిల్లీ, థర్డ్ క్లాస్ ఆరోపణ. లా అండ్ ఆర్డర్ కాపాడటానికి, ప్రతీప శక్తులను అడ్డుకోవడానికి పలు మార్గాల్లో పోలీసులు సమాచారం సేకరిస్తుంటారు. అందులో ఇంటర్‌సెప్షన్ ఒకటి. అది అధికారికంగా చేస్తారు. 'ఫలానా వ్యక్తుల ఫోన్లను ట్యాప్ చేసినం' అని అధికారులు ముఖ్యమంత్రి కి చెప్పరు. సీఎంకు సంబంధముండదు. ఇప్పుడున్న ముఖ్యమంత్రికీ రోజూ ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్ వస్తుంది. దీన్నికూడా రాజకీయం చేయడమంటే దివాళాకోరుతనం ఇంకోటి ఉండదని ఓ టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. ఇంతకాలం మౌనంగా ఉంటూ తనపై వచ్చిన ఆరోపణలను ఇలా కొట్టి పడేశారు. అయితే ఇప్పటి వరకు జరిగిన, జరుగుతున్న దర్యాప్తులో అనేక విషయాలు బయట పడుతున్నాయి. వాటి గురించి మాట్లాడ లేదు. మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగితే మాత్రం తానే సిఎంనని కూడా చెప్పుకున్నారు. నిజానికి ఇలా జరుగుతాయా అన్నది ఆయనకే తెలియాలి. ఆర్థిక దివాళా అన్నది అతిపెద్ద సమస్య. దీనిపై స్పష్టమైన ప్రకటన చేయలేదు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత టీఆర్ఎస్ అంటే ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో అధికారంలో వచ్చింది. కేసీఆర్ అధికార పగ్గాలు చేపట్టిన అనంతరం తెలంగాణలో ఉద్యమ నినాదాలకు తిలోదకాలు ఇచ్చి నియంతృత్వ పాలన సాగించారు. నేనే రాజు,నేనే మంత్రి అనే రీతిలో నియంత పాలన సాగింది. ప్రతిపక్షాలు లేని వ్యవస్థ కావాలని కలలు కన్నారు. ప్రతిపక్షాలను గౌరవించకుండా, వాటిని గుర్తించకుండా పాలన చేశారు. ఏ ఒక్క సందర్భంలోనూ పదేళ్ల కాలంలో ఆయన విపక్షాలతో చర్చించలేదు. సంచలనం కలిగించిన పేపర్ లీకేజీలు, మేడిగడ్డ కుంగుబాటు వంటి సమస్యలను కూడా ఏనాడు చర్చించలేదు. అసెంబ్లీలో చర్చ లేకుండా చేశారు. ఇకపోతే ప్రతిపక్షమే లేకుండా చేయాలని చూసి కాంగ్రెస్, టిడిపి, సిపిఐ ఎమ్మెల్యేలను గంపగుత్తగా తన మందలో కలుపుకున్నారు. దీనికి తెలంగాణ పునరేకీకరణ అని చెప్పుకొచ్చారు. ఈ పార్టీలకు తెలంగాణలో ఉనికి లేకుండా చేశారు. ఆ తరువాత కాంగ్రెస్ నాయకులను కూడా కొనుగోలు చేసి ఆ పార్టీని బలహీనపర్చారు. ఇప్పుడు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటువేయండి అంటున్న నేతలంతా అప్పుడు నిర్లజ్జగా ఎమ్మెల్యేలను కలుపుకున్నారు. అసెంబ్లీలో ఎవ్వరినీ మాట్లాడనీయకుండా చేశారు. మాట్లాడిన వారిని సస్పెండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రత్యేక పాత్ర పోషించిన అన్ని పార్టీల ఎమ్మెల్యేను కూడా దుర్మార్గంగా టీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. 2018లో టీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికార పగ్గాలు చేపట్టిన తరువాత అదే పనిని కొనసాగించారు. తెలంగాణ అంటే టీఆర్ఎస్ అంటే నేనే అనే అహంభావంతో కెసిఆర్ వ్యవహరించారు. అందుకే ప్రభుత్వం పడిపోయాకనే జరిగిన అనేక అవతవకలు అక్రమాలు బయటకు వస్తున్నాయి. ఈ క్రమంలో ఫోటన్ ట్యాపింగ్‌ను తూఛ్.. అన్నంత మాత్రాన అది పోయేది కాదు. నిజాలు నిగ్గు తేలుస్తారు. ఎవరెవరు ఎలా వ్యవహరించారో, ఎంతగా బరితెగించారో తెలుస్తోంది. ప్రభుత్వ యంత్రాంగంలోతనకు నచ్చిన ఐఏఎస్, ఐపీఎస్‌లు, ఉన్నతాధికారులు.. అంటే చెబితే వినే వారిని ఏళ్లుగా ఒకే పదవిలో కొనసాగించారు. పది జిల్లాల తెలంగాణ 33 జిల్లాలు చేసి పరిపాలన చిన్నాభిన్నం చేశారు. ఇలాచేసి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారు. అనవసరంగా కలెక్టరేట్ల నిర్మాణాలకు తగలేశారు. ఇలాంటి సమయాల్లో కూడా విపక్షాలతో చర్చించాలన్న ఇంగితం కెసిఆర్ ప్రద్శించలేదు. ఏకపక్షనిర్ణయాలు, నియంతృత్వం పోకడలు భరించలేనంతగా సాగాయి. ఉద్యమంలో పాల్గొన్న మేధావుల సలహాలు తీసుకోకపోవడం అటుంచి వారిని గడపకూడా తొక్కనీయలేదు. ఏకవ్యక్తి పోకడలతో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడు. చట్టాలను చట్టుబండలు చేశాడు. మాట్లాడిన వారిపై కేసులు పెట్టారు. ప్రాజెక్టుల్లో అయితే భారీగా అవినీతి బయటపడింది. రైతులను రోడ్డున పడేశారు. ఊళ్లకు ఊళ్లు ఖాళీ చేయించి జులుం చలాయించారు. అయినా వారికి గౌరవంగా దక్కాల్సిన పరిహారం దక్కలేదు. సాగునీటి ప్రాజెక్టులు పనులను పక్కకు పెట్టి మేడిగడ్డ అన్నారు. సుందిళ్ల బ్యారేజిలు కట్టి కాళేశ్వరం రూపొందించారు. కాళేశ్వరం పేరుతో ప్రత్యేక కార్పొరేషన్ పెట్టి దాదాపు 94 వేల కోట్ల రూపాయల ఖర్చు చేశారు. ఇలా ఇబ్బడిముబ్బడిగా చేసిన అప్పులు ఆర్థిక అరాచకత్వానికి అద్దం పడుతున్నది. అడ్డగోలుగా విద్యుత్ వ్యయం, అప్పులు, వడ్డీలు, కాళేశ్వరం ప్రాజెక్టు రూపేణా ప్రభుత్వం మీద ఆర్థిక భారం మోపారు. సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం విషయం లో కేసీఆర్ ఒంటెద్దు పోకడలు అనేక తప్పటడుగులు వేశారు. సిద్ధిపేటతోపాటు కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కు నీళ్లు వచ్చే విధంగా కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. మేడిగడ్డ వద్ద పిల్లర్లు కుంగిపోవడం, సుందిళ్ల వద్ద ప్రాజెక్టులకు బుంగలు పడటం కేసీఆర్ మార్కు పాలనకు అద్దం పడుతోంది. ప్రజాసమస్యల వేదిక ప్రజాగొంతుక అయిన ఇందిరాపార్కు ధర్నాచౌక్ ఎత్తివేసిన ఘనత కూడా కేసీఆర్‌కే చెల్లుతుంది. ఇలా అనేక అవకతవకలు, అక్రమాలకు పాల్పడ్డ కెసిఆర్..తప్పులను ఒప్పుకోవడానికి సిద్దంగా లేరు. ఇంకా నాలుగు నెలల క్రితమే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులపై ఎదురుదాడికి దిగుతున్నారు. వారు ఏమీ చేయడం లేదని రోడ్డెక్కి గోల చేస్తున్నారు. రాజకీయాలను భ్రష్టు పట్టించిన కేసీఆర్‌కు ఇప్పుడు బీఆర్ఎస్ మునిగిపోయే ప్రమాదం ఏర్పడింది. అయినా తండ్రీ కొడుకులు, అల్లుడు బింకం వదలడం లేదు. కవిత లిక్కర్ కేసు ఉత్తిదే అంటారు. ఫోన్ ట్యాపింగ్ ఉత్తిదే అంటారు. అప్పులు చేసి అభివృద్ధి చేశామంటారు. ఇలా వారు చెప్పినవి నమ్మితే మోసపోయేది ప్రజలే.

# మోదీ బడే భాయ్.. రేవంత్ చోటే భాయ్...

మేడ్చల్,మోదీ బడే భాయ్ రేవంత్ చోటే భాయ్ అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇవాళ ఆయన మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా దొంగలమైసమ్మలో ప్రచారం నిర్వహించారు.మోదీ, రేవంత్‌లు ఇద్దరు పెద్ద మోసగాళ్లని ఎన్నికల వాగ్దానాలను అమలు చేయటంలో ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు. ఇక్కడ బిజెపి నుంచి పోటీ చేస్తున్న ఈటెలను, అలాగే కాంగ్రెస్ నుంచి పోటీచేస్తున్న సునీతారెడ్డిలు వలస పక్షులతో పోల్చారు. బీజేపీ, కాంగ్రెస్‌కు మళ్ళీ ఓటు వేసి మోసపోవద్దని హితవు పలికారు. వారికి డిపాజిట్ రాకుండా ఓడించాలని కోరారు. స్థానికంగా అందుబాటులో ఉండే రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి గెలిపించాలన్నారు. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కి 10 నుంచి 12 సీట్లలో గెలిపించి, దేశంలో కీలక భూమిక కు పోషించేలా, రాజకీయాలను శాషించేలా అవకాశం కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చామకురా మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కూన వివేకానంద, బండారు. లక్ష్మారెడ్డి, మాధవరం కృష్ణారావు, దేవినేని సుధీర్ రెడ్డి, దయానంద్ గుప్త, ఎమ్మెల్సీలు సురభి వాణి, శంభీపూర్ రాజు స్థానిక నాయకులు డి.సి.ఎం.ఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి,

# పాయకరావు పేటలో పాగా వేసేదెవరో

అనకాపల్లి,అనకాపల్లి జిల్లా పాయకరావు పేట బరిలో దిగిన తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇక్కడి నుంచి ఒకసారి గెలిచిన వారు మళ్లీ గెలవరన్న సెంటిమెంట్ ఉంది. దీంతో అనిత గెలుస్తుందా లేదా అన్న చర్చ మొదలయ్యింది. ఈ ఎన్నికల్లో వైసీపీ తరపున కంబాల జోగులు బరిలో ఉండగా.. కూటమి తరపున వంగలపూడి అనిత పోటీ చేస్తున్నారు. ఆమె చరిత్ర తిరగరాస్తారా అన్నది చూడాలి. కాగా.. అనిత 2014 ఎన్నికల్లో ఇక్కడ్నుంచి 2,828 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇక జోగులు ఈ నియోజకవర్గం నుంచి ఒక్కసారి పోటీ చేయలేదు.. ఇదే తొలిసారి. అయితే.. 2004లో పాలకొండ, 2014 ఎన్నికల్లో రాజాం నుంచి, 2019లో కూడా రాజాం నుంచి పోటీచేసి మొత్తం మూడుసార్లు అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. ఈ ఎన్నికల్లో పాయకరావుపేటకు వైసీపీ హైకమాండ్ ట్రాన్స్‌ఫర్ చేసింది. దీంతో సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న జోగులు గెలుస్తారా..? లేకుంటే ఇదివరకే ఒకసారి గెలిచిన అనిత గెలుస్తారా..? అనేది చూడాలి. అయితే.. ఒక్కసారి ఓడితే.. మళ్లీ గెలవడం కష్టమేనన్న హడావుడితో అటు వైసీపీలో.. ఇటు కూటమిలోనూ టెన్షన్ మొదలైంది. పాయకరావుపేట నియోజకవర్గంలో పోటీ చేసినవారు ఒకసారి ఓడిపోతే ఇక అంతే సంగతులన్న ప్రచారం ఉంది. రెండోమారు మళ్లీ గెలిచిన సందర్భాలు లేవు. గంటెల సుమన, చెంగల వెంకట్రావు, కాకర నూకరాజు పాయకరావుపేట నుంచి పలుమార్లు పోటీ చేశారు. అయితే ముగ్గురూ ఒకసారి ఓడిపోయిన తరువాత ఎన్నిసార్లు పోటీ చేసినా తిరిగి గెలవలేదు. 1983 ఎన్నికల్లో టీడీపీ తరపున తొలిసారిగా గెలుపొందిన గంటెల సుమన ఆ తరువాత నాదెండ్ల భాస్కరరావుకు మద్దతు తెలిపి టీడీపీకి దూరమయ్యారు. అనంతరం 1985లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కాకర నూకరాజు మొదటిసారి పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత 1989, 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కాకర నూకరాజుకి ప్రత్యర్థిగా, అదేవిధంగా 1999లో టీడీపీ తరపున తొలిసారిగా పోటీ చేసిన చెంగల వెంకట్రావుకు ప్రత్యర్థిగా కాంగ్రెస్ (అనీనిణసబబ) తరపున గంటెల సుమన పోటీ చేసి...ఆ మూడు ఎన్నికల్లోనూ వరుసగా ఓటమి పాలయ్యారు. 1999 ఎన్నికల్లో అన్న తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన కాకర నూకరాజు మూడో స్థానంలో నిలిచారు. అదేవిధంగా 2004లో టీడీపీ తరపున చెంగల వెంకట్రావు రెండోసారి పోటీ చేయగా.. కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ఎ.విజయరావుతో పాటు ఇండిపెండెంట్‌గా పోటీలో నిలుచున్న గంటెల సుమన ఓటమిపాలయ్యారు. 2009లో టీడీపీ తరపున మూడోసారి బరిలోకి దిగిన చెంగల వెంకట్రావు కాంగ్రెస్ అభ్యర్థి గొల్ల బాబూరావు చేతిలో ఓటమి చెందారు. ఆ తరువాత 2012 ఉప ఎన్నికలో వైసీపీ తరపున పోటీ చేసిన గొల్ల బాబూరావు విజయం సాధించగా టీడీపీ టికెట్టుపై పోటీచేసిన చెంగల వెంకట్రావు, కాంగ్రెస్ తరపున పోటీ చేసిన గంటెల సుమన ఓటమిపాలయ్యారు. ఆ తరువాత 2014లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీచేసిన చెంగల వెంకట్రావు ఓటమి చెందారు. ఇక 2019లో బీజేపీ టికెట్‌పై పోటీ చేసిన కాకర నూకరాజు నోటా కంటే తక్కువ ఓట్లు సాధించి ఓడిపోయారు. ఇలా గంటెల సుమన ఒకసారి ఎన్నికల్లో ఓడిన తరువాత ఐదుసార్లు పోటీచేసినా గెలవలేకపోయారు. అదేవిధంగా చెంగల వెంకట్రావు, కాకర నూకరాజు ఒక సారి ఓటమిపాలైన తరువాత రెండు పర్యాయాలు పోటీ చేసినా గెలవలేదు.

# అధికారం సరే..

న్యూఢిల్లీ, కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న బిజెపి..మరోమారు అధికారం కోసం ప్రయత్నించడంలో తప్పు లేదు. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మళ్లీ అధికారంలోకి రావాలనుకోవడంలోనూ తప్పులేదు. అలాగే కొత్తగా తెలంగాణ,ఎపిల్లోనూ పాగావేయాలని ప్రయత్నించడంలోనూ తప్పులేదు. దేశం అంతా తమ ఏలుబడిలో ఉండాలని కోరుకోవడంలోనూ తప్పు లేదు. అయితే అధికారం ఎందు కోసం..ఎవరికోసం.. అన్న ప్రశ్నలు వేసుకోవాలి. కేవలం మోడీని మోయడానికే అధికారమా..లేక ప్రజలకు మేలు చేయడానికా అన్న ప్రశ్నలు బిజెపి నేతలు వేసుకోవాలి. దేశానికి సేవచేసే క్రమంలో ఎంతవరకు విజయం సాధించారో చెప్పాలి. పార్లమెంటులో సమస్యలకు సమాధానం చెప్పలేని వాళ్లు..సమస్యలపై చర్చించలేని వారు ప్రజలకు ఏ మేరకు సేవ చేశారని ఎలా చెప్పగలం. పార్లమెంటులో ఏదైనా అంశంపై చర్చకు పట్టుబట్టినా దానిని దాటవేస్తూ వచ్చారు. ప్రజలకు మంచి చేసేందుకు ఎవరు ముందుకు వచ్చినా మంచిదే...ఆ పని బిజెపి చేస్తుందనుకుంటే ప్రజలు తప్పకుండా బిజెపినే ఆదరిస్తారు. కానీ ఎదుటి పార్టీలను నిందించడం ద్వారా అధికారంలోకి రావడం అన్నది అసంభవం. కర్నాటకలో ఏం చేశారో..గుజరాత్‌లో ఏం చేశారో..మధ్య ప్రదేశ్‌లో ఏం చేశారో చెప్ప గలగాలి. కానీ బిజెపి నేతలు అలా చెప్పడం లేదు. ఎందుకంటే చెప్పుకోవడానికి ఏమీ లేదు కనుక చెప్పడం లేదు. ఎంతసేపు కాంగ్రెస్‌ను భ్రష్టు పట్టించడం.. తప్ప మరోటి చేయడం లేదు. ఈ దృష్టిని ప్రజా సంక్షేమంపై సారించివుంటే బిజెపికి తిరుగు ఉండేది కాదు. కానీ చేతకాని తనాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నాల్లో మోడీ, అమిత్ షాలు పోటీ పడుతున్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా అవినీతి కేసుల్లో దర్యాప్తు సాగుతోంది. అందుకే తెలంగాణకు లేదా ఎపికి ఏం చేశారో చెప్పాలి. సవాళ్లకు జవాబు ఇవ్వాలి. తెలంగాణకు ఏదో చేశామంటే నమ్మేవాళ్లు ఎవరని వస్తున్న ప్రశ్నిస్తున్న వారికి సమాధానం చెప్పాలి. బయ్యారం ఉక్కు అతీగతీ లేదు. విభజన హామీలు అమలు కానేకాలేదు. ÷ూష్ట్రానికి మెగా టెక్స్‌టైల్ పార్క్ మంజూరు కోరుతున్నా పట్టించుకోలేదు. ప్రధాని పదవి ప్రజలు పెట్టిన భిక్ష. ఎవరు ఉండాలో వద్దో ప్రజలు తేలుస్తారు. కావాలనుకుంటే ప్రజల మనసులు గెలిచేలా ఇంత వరకు ఏం చేశామో చెబుతారు. లేదా ఒకవేళ అధికారం ఇస్తే ఎలాంటి అభివృద్ధి చేస్తామో వివరిస్తారు.కానీ అమిత్‌షా, బీజేపీ నేతలు మాత్రం ప్రజల్లో వివక్ష పెంచేందుకు, భ్రమలు కల్పించేందుకు మాత్రమే పరిమితం అయ్యారు. అవినీతి గురించి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా బిజెపి నేతల ఆరోపణలు ఉన్నాయి. నిజానికి అవినీతి ఉంటే నిగ్గు తేల్చాలి. తమ చేతుల్లో ఉన్న కేంద్ర దర్యాప్తు సంస్థలతో నిజాయితీగా విచారణ చేయించాలి. అవినీతి ఎక్కడ..ఏ రూపంలో ఉన్నా విచారణ జరగాల్సిందే. నిజాయితీగా దీనికి పూనుకోవాలి. అక్రమార్కులను చీల్చి చెండాడాలి. అంతేగానీ కేవలం విపక్ష పార్టీల అవినీతిని ఎత్తిచూపుతూ..తమ పార్టీకి చెందిన వారి అవినీతి గురించి మాట్లాడకపోవడం కూడా అవినీతి కిందే లెక్కకట్టాలి. ఇకపోతే ప్రజలంతా మన ప్రజాస్వామ్యం సక్రమంగా మనుగడ సాగిస్తున్నదా లేదా అన్న ఆలోచన చేయాలి. పాలకులు నిజాయితీ గా ఉంటున్నారా లేదా అన్న ఆలోచన చేయాలి. ఓట్లను అమ్ముకోవడంతో వారు మన నెత్తిన ఎక్కి కూర్చుంటున్నారు. అధికారం దక్కగానే వారు తీసుకునే నిర్ణయాలకు మనం బలవుతున్నాం. వారు విదిల్చే తాయిలాలకు లొంగడం వల్ల మనలను అమాయకులను చేసి ఆడిస్తున్నారు. ఇవన్నీ ప్రజలుగా ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. ఓటేసే ముందు..వేసిన తరవాతా నేతల తీరు గురించి ఆలోచించాలి. వారి కుట్రలకు ప్రజలు బలిపశువులు కాకూడదు.

# ఊపందుకున్న నామినేషన్ల ఘట్టం

హైదరాబాద్, ఎన్నికల నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగియనుంది. దీంతో అభ్యర్థులు నామినేషన్లు వేసే పనిలో పడ్డారు. కొందరు మరోమారు సెట్లను సమర్పిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు నాలుగో విడత ఎన్నికల్లో భాగంగా మే నెల 13న పోలింగ్ జరగనుండటంతో.. నామినేషన్‌ల ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ నెల 18 మొదలైన నామినేషన్‌లకు రేపటితో గడువు ముగియనుంది. గడువు ఒక్కరోజే ఉండటంతో పెద్ద సంఖ్యలో నామినేషన్‌లు దాఖలవుతున్నాయి. బుధవారం మెదక్ లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి సెట్ 1 నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి వెంట సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్, బీఆర్ఎస్ నేత పుష్ప నాగేష్ యాదవ్ ఉన్నారు. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నాయకులు, అనుచరులతో కలిసి సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన గాలి అనిల్ కుమార్.. ఎన్నిలక రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా అభ్యర్థి అనిల్ కుమార్ వెంట బీఆర్ఎస్ కీలక నేత, రాష్ట్ర మాజీ మంత్రి హరీశ్‌రావు, జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ రెడ్డి ఉన్నారు. తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలకు నాలుగో విడత ఎన్నికల్లో భాగంగా మే 13న పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి మాజీ కలెక్టర్, వెంకట్రామ్ రెడ్డి బుధవారం ఉదయం నంగునూర్ మండలం, కొనాయి పల్లి వెంకటేశ్వరా స్వామి దేవాలయంలో స్వామి పాదాల వద్ద నామినేషన్ పత్రాలు పెట్టీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నామినేషన్ పత్రాలను కొనాయిపల్లి ఆలయంలో పెట్టీ ప్రత్యేక పూజలు చేశామని, ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. మెదక్ ప్రజల కుటుంబ సభ్యుడిగా ఉంటానని, ప్రజల సేవకు అంకితం అవుతానని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో తాను ఇచ్చిన హామీలు అమలు చేస్తానని, వెంకటేశ్వర స్వామి ఆశీర్వాదం తీసుకున్న దేవుడిపై సాక్షిగా ప్రమాణం చేసి చెబుతున్న.. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానని వెంకట్రామ్ రెడ్డి స్పష్టం చేశారు. రూ. 100 కోట్లతో ఫంక్షన్ హాల్, పేదలకు విద్య అందిస్తామన్నారు. మెదక్ పార్లమెంటు అభ్యర్థిగా ఘనవిజయం సాధిస్తానని వెంకట్రామ్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కలెక్టర్‌గా పనిచేసే అవకాశం తనకు రావడం అదృష్టమని వెంకట్రామ్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకే తాను మెదక్ ఎంపీగా పోటీ చేస్తున్నానన్నారు. కలెక్టర్‌గా మెదక్ ఉమ్మడి ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశానని, ఇకపై రాజకీయాల్లోనూ పేదలకు సేవ చేస్తానని వెంకట్రామ్ రెడ్డి ప్రకటించారు.

# బంగారం ధరలకు స్వల్పంగా బ్రేక్

న్యూఢిల్లీ, బంగారం కొనుగోలుదారులకు కొంత ఊరట దక్కింది. ఇన్నాళ్లూ భారీగా పెరిగిన బంగారం ధరకు కాస్త బ్రేక్ పడింది. అంతర్జాతీయంగా గిరాకీ తగ్గడంతో పసిడి ధర దిగి వచ్చింది. అంతర్జాతీయ విపణిలో బంగారం ధర క్షీణించడంతో దేశీయంగా వెయ్యి రూపాయలకు పైనే తగ్గింది. మంగళవారం రాత్రి 8 గంటల సమయానికి బులియన్ మార్కెట్లో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి (24 క్యారెట్లు) ధర రూ.74,300గా (పన్నులు కలుపుకొని) ఉంది. వెండి కిలో ధర సైతం రూ.2 వేల వరకు తగ్గింది. 83,300 వద్ద కొనసాగుతోంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర ఔన్సు 2322 డాలర్లుగా ఉంది. ఒక్కరోజులోనే దాదాపు 50 డాలర్లకు పైగా తగ్గింది. పశ్చిమాసియాలో ఇరాన్‌- ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు ఇటీవల పసిడి ధరలకు రెక్కలు రావడానికి కారణమయ్యాయి. దీంతో సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించి బంగారంవైపు మదుపరులు దృష్టి సారించారు. ప్రస్తుతం ఘర్షణలు తగ్గుముఖం పట్టడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరికొంత కాలం పాటు అధిక వడ్డీ రేట్లను కొనసాగించే అవకాశాలు కనిపిస్తుండడంతో పసిడికి గిరాకీ తగ్గింది. రిస్క్‌తో కూడిన పెట్టుబడిన సాధనాల వైపు మదుపరులు పెట్టుబడులు మళ్లిస్తుండడం, గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణకు ట్రేడర్లు మొగ్గు చూపడంతో బంగారం ధర తగ్గడానికి కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీలో సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు.

# సవాల్ గా రెండు సీట్లు

నల్లగొండ,నల్గొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాలు కాంగ్రెస్ అగ్ర నేతలకు సవాల్ గా మారాయి. ముఖ్యంగా ఇద్దరు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలకు ఈ రెండు సీట్లు సవాల్ లాంటివే. గెలవడంతో పాటు, మెజార్టీ సాధిస్తేనే వీరికి గౌరవం దక్కుతుంది. ఇక్కడ పార్టీల మధ్య జరుగుతున్న పోటీ కంటే నల్గొండ వర్సెస్ భువనగిరి మధ్య జరుగుతున్న పోటీగానే కాంగ్రెస్ భావిస్తోంది. ఇద్దరు జిల్లా మంత్రులు, ఇన్ చార్జి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దేశంలోనే అత్యధిక మెజార్టీ సాధిస్తామని శపథం చేయడం ఆసక్తికరంగా మారింది. రెండుచోట్ల భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి ఉమ్మడి నల్గొండ జిల్లాకు ప్రత్యేకమైన గుర్తింపు తెస్తామని మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భువనగిరి ఇన్‌చార్జి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రెండుచోట్ల బీఆర్ఎస్, బీజేపీ పోటీనే కాదని, నల్గొండ కాంగ్రెస్, భువనగిరి కాంగ్రెస్ మధ్య జరుగుతున్న యుద్ధమని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. నాలుగు లక్షల మెజార్టీ సాధిస్తామని అంటున్నారు. ఈ ఎన్నికల్లో రెండు పార్టీలకు డిపాజిట్లు దక్కకుండా జిల్లా అగ్రనేతలు పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో నల్గొండ ఎంపీ సెగ్మెంట్ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. అదే స్పీడ్‌తో మెజార్టీ కూడా సాధించి తీరుతామని మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి పనిచేస్తున్నారు. దివంగత ఎంపీ రావి నారాయణరెడ్డికి వచ్చిన రికార్డు మెజార్టీని బ్రేక్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. నల్గొండ, భువనగిరి ఎంపీ సెగ్మెంట్ల పరిధిలోని 14 నియోజకవర్గాల్లో 12 చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. వీరంతా అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించారు. దీంతో ఎంపీ ఎన్నికల్లో నాలుగు లక్షల మెజార్టీ వస్తదనే ధీమాతో ఉన్నారు. 1952లో సార్వత్రిక ఎన్నికల్లో రావి నారాయణరెడ్డికి 2,72,280 మెజార్టీ వచ్చింది. ఈయన భువనగిరి నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. ఈ ఎన్నికల్లో దేశంలో నెహ్రూకు వచ్చిన మెజార్టీ కంటే రావి నారాయణకు వచ్చిన మెజార్టే ఎక్కువ. ఆ తర్వాత మళ్లీ 2009లో నల్గొండ ఎంపీ సెగ్మెంట్‌లో గుత్తా సుఖేందర్?రెడ్డికి 1,52,982 ఓట్ల మెజార్టీ రాగా, 2014 లో 1,93,156 ఓట్ల మెజార్టీ వచ్చింది. రెండు ఎంపీ సీట్లను కాంగ్రెస్ సీనియర్లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. రెండుచోట్ల సీఎం రేవంత్ రెడ్డి సన్నిహితులు కావడం ఒక ఎత్తయితే, సీఎంతో జిల్లా నేతలకు ఉన్న విభేదాలు కూడా ఈ ఎన్నికల్లో తుడిచిపెట్టుకు పోయాయి. అందరూ ఐక్యంగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుపైనే దృష్టి పెట్టారు. నల్గొండకు మించి భువనగిరి అభ్యర్థి 3 లక్షల మెజార్టీ సాధిస్తే యాదాద్రి టెంపుల్ పేరును మళ్లీ యాదిరిగుట్టగా మారుస్తానని, మూసీ ప్రక్షాళన చేస్తామని, గంధమల్ల, బ్రాహ్మణ

# రిజర్వేషన్ మిస్సైల్?! ముస్లిం ఓటు బ్యాంకుపై పార్టీల టెన్షన్




విజయవాడ : అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లింలు అనుభవిస్తున్న 4 శాతం రిజర్వేషన్ తొలగిస్తామని ఒడిశి సభలో హిందువులకు కేంద్ర హెంమంత్రి అమిత్ షా వల విసిరారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగం దీన్ని అనుమతించదని అన్నారు.ముస్లింల 4 శాతం రిజర్వేషన్‌ను తొలగించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు పంపిణీ చేస్తామని తెలిపారు. “ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు బీజేపీ మాత్రమే న్యాయం చేస్తుందని అమిత్ షా ఈ సందర్భంగా చెప్పారు. ఏపీలోనూ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరీ ఇదే నినాదం అందుకున్నారు. ఇప్పటికే ఏపీలో ముస్లింలను దూరం చేసుకోలేక టీడీపీ, జనసేన ముఖ్యనేతలు ముస్లిం వర్గాలను సముదాయిస్తున్నారు. ఇలాంటి స్థితిలో బీజేపీ తీసుకున్న ఈ నిర్ణయంతో ముస్లిం వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

ఏపీలో కూటమి అవాక్కు

ఏపీలో టీడీపీ, వైసీపీ ఇస్తున్న రంజాన్ తోఫా కంటే.. నాలుగు శాతం రిజర్వేషనే ముస్లింలకు ముఖ్యం. తమ బిడ్డలకు ఈ రోజున ఉన్నత చదువులకు అవకాశం వచ్చిందంటే.. రిజర్వేషన్ ఫలితమే. ఇప్పటి వరకూ కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకుగా నిలిచిన ముస్లింలు.. అధికార పార్టీకి సలాం చేయటం సర్వసాధారణం. కానీ, బీజేపీ విసిరిన ముస్లిం వ్యతిరేక పాచికతో ఏపీలోని ముస్లింలలో ఆందోళన పెరిగింది. టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీతో కలిసి ఎన్నికలకు వెళ్తున్నతరుణంలో ఇది ఇబ్బందికరంగా మారనుంది. బీజేపీతో పొత్తు పెట్టుకోకవటంతో ఏపీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా ముస్లింల 4 శాతం రిజర్వేషన్ తొలగిస్తామని బీజేపీ ప్రకటించడంతో ఏపీలో ప్రధాన ప్రతిపక్షం టీడీపీ ఇరాకటంలో పడినట్టే.

13 లోక్‌సబ, 91 అసెంబ్లీ సీట్లపై ప్రభావం..

బీజేపీ తీసుకున్న ఈ నిర్ణయంతో ఏపీలో టీడీపీ, జనసేన పరిస్థితి అంతుచిక్కటం లేదు. ఏం చేయాలో అర్థం కాని ధర్మసంకటంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి, ఎన్డీయే కూటమిని గెలిపిస్తే ఏపీలోనూ 4 శాతం రిజర్వేషన్ తీసేస్తారనే అభద్రతాభావంతో ముస్లింలు ఆలోచనలో పడ్డారు. యాంటీ ముస్లీం నిర్ణయం నిర్ణయ ప్రభావం కచ్చింతంగా వచ్చే ఎన్నికల్లో కనిపిస్తుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ముఖ్యంగా ముస్లింలు అత్యధికంగా ఉండే నియోజకవర్గాల్లో ఫలితాల్లో.. తీవ్ర ప్రభావం తప్పదని ప్రచారం జరుగుతోంది. ఏపీలో 13 ఎంపీ స్థానాలు, 91 అసెంబ్లీ స్థానాల్లో ముస్లీం వ్యతిరేక నినాదం కారణంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి దెబ్బ తప్పదని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. వాస్తవానికి ఈ ఎన్నికల్లో అత్యధిక ముస్లీం జనాభా ఉన్న ప్రాంతాలపై అటు వైసీపీ, ఇటు టీడీపీ ప్రత్యేక దృష్టి సారించాయి. కానీ అభ్యర్థులను బరిలోకి దించే విషయంలోనూ ఆచీతూచీ వ్యవహరించాయి.

గుంటూరులో సెల్ఫ్ గోలే..

రాజకీయ చైతన్యానికి కీలక మైన గుంటూరు జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీల గెలుపు ఓటములపై ముస్లీం ఓటర్లే నిర్ణేతలు . అందుకే ముస్లీం ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు అన్ని పార్టీలు ముస్లీం భాయ్ల చుట్టూ తిరుగుతుంటారు. గుంటూరు జిల్లాలోని గుంటూరు నగరంలో 18.05 శాతం ముస్లీంలు ఉన్నారు. నరసారావుపేటలో 22.52 శాతం, చిలకలూరిపేటలో 23.89 శాతం, వినుకొండలో 22.92 శాతం, పొన్నూరులో 21.13 శాతం ముస్లీం ఓట్లు ఉన్నాయి. అందుకే గుంటూరు ఈస్ట్ నియోజకవర్గంపై ఇటు వైసీపీ, అటు ఎన్డీయే కూటమి ముస్లీంలనే బరిలోకి దించాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే ముస్తాఫ తనయ నూరి ఫాతిమా, టీడీపీ అభ్యర్థిగా అహ్మద్ నజర్ పోటీ చేస్తున్నారు. అంటే ఉమ్మడి జిల్లాలోని ముస్లీంలను ఆకట్టుకోవటానికే ఈ ప్రయత్నం జరిగింది. ఇక బీజేపీ సంధించిన రిజర్వేషన్ రద్దు అస్త్రం పని చేస్తే.. నరసారావుపేట, చిలకలూరి పేట, వినుకొండ, పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గాలకే కాదు.. నరసరావుపేట ఎంపీ అభ్యర్థికీ చిక్కులు తప్పవని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

కర్నూలులో కొంప కూలినట్టే

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ముస్లీంల ప్రభావం ఎక్కువే. రాజకీయ చరిత్రను పరిశీలిస్తే అనేక ఎన్నికల్లో ముస్లీం నేతలకే ప్రాధాన్యం కనిపిస్తుంది. అటు కాంగ్రెస్, టీడీపీ మధ్య పోటీ గానీ.. ఇటు వైసీపీ, టీడీపీ మధ్య పోటీ చరిత్రను పరిశీలిస్తే .. ప్రధాన రాజకీయ పార్టీల గెలుపు ఓటమిపై ముస్లీంలు తీవ్ర ప్రభావం చూపించాయి. ముస్లీంల మద్దతు లేనిదే రాజకీయ పార్టీల మనుగడ లేదు. ఎందుకంటే .. కర్నూలు నగరం లో 34.39 శాతం, నంద్యాలలో 32.63 శాతం, ఆదోనిలో 26.49 శాతం, ఎమ్మిగనూరులో 22.81 శాతం, బేతంచర్లలో 23.32 శాతం, మామిడాలపాడులో 27.57 శాతం మంది ముస్లీం ఓటర్లు ఉన్నారు. ఇక బనగాన పల్లెలో హిందువులు 51.63 శాతం ఉంటే ముస్లీంలు 47.11 శాతం మంది ఉన్నారు. అందుకే కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఐఏఎస్ మాజీ అధికారి ఎండీ ఇంతియాజ్ నుంచి వైసీపీ బరిలోకి దించితే.. నంద్యాలలో ఎన్ ఎండీ ఫరూక్ను టీడీపీ రంగంలోకి దించింది.

అనంత ప్రభావం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ముస్లీం ఓటర్లు ఎక్కువే. ఈ జిల్లాలోనూ అన్ని రాజకీయ పార్టీలూ ముస్లీం ఓటర్ల కోసం వంగి వంగి సలాంలు చేస్తారు. కదిరి నియోజకవర్గంలో ముస్లీం అభ్యర్థులనే పోటీలోకి దించుతారు. ఈ ప్రభావం గుంతకల్లు, తాడిపత్రి, హిందూపురం నియోజకవర్గాలపై పడుతుంది. అనంతపురం జిల్లాల్లో ముస్లీంల ప్రభావాన్ని పరిశీలిస్తే అనంతపురం లో 21.02 శాతం, హిందూపురంలో 34.62 శాతం, గుంతకల్లులో 25.23 శాతం, తాడిపత్రిలో 26.58 శాతం, కదిరిలో 44.25 శాతం,హిందువులు 54.26 శాతం, గూటిలో 22.54 శాతం ముస్లీం ఓటర్లు ఉన్నారు. అందుకే కదిరి అసెంబ్లీ బరిలోకి మక్బుల్ అహ్మద్ ను వైసీపీ దించింది. ఇక హిందూపురంలో అనూహ్యంగా ఇనయతుల్లాకు కాంగ్రెస్ పార్టీ దించింది.

కడపలో కష్టమే

కడప జిల్లాలో ముస్లీం ఓటర్ల ప్రభావితం అంతా ఇంత కాదు. కడప నగరంలో 32.91 శాతం, ప్రొద్దుటూరు 25.58 శాతం, రాయచోటి 49.09 శాతం, రాజంపేట 20.75 శాతం, పులివెందుల 15.59 శాతం, జమ్మలమడుగు 20.86 శాతం, రామేశ్వరం 26.48 శాతం, నాగిరెడ్డి పల్లి 25.59 శాతం, మోడమీది పల్లి 27.16 శాతం, చెన్నముక్క పల్లి 49.87 శాతం ముస్లీం ఓటర్లు ఉన్నారు. కనీసం ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముస్లీం ఓటర్లే నిర్ణేతలుగా కనిస్తారు. ఇక్కడ ముస్లీంలు ఎవరికి మద్దతు పలికితే .. ఆ రాజకీయ పార్టీ మాత్రమే విజయం సాధిస్తుంది. ఇప్పటి వరకూ ఉమ్మడి కడప జిల్లాపై కేంద్ర రాజకీయ ధోరణే ప్రభావం చూపించింది. ఈ జిల్లాలో బీజేపీకి నామమాత్రం బలం కూడా లేదు. టీడీపీలో కొందరు ముస్లీం నేతలు తమ సొంత బలంతోనే విజయం సాధించారు.

కడపపై కాంగ్రెస్ గురి

కడప జిల్లాలోని 10 అసెంబ్లీ, కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాల పరిధిలో కడప అసెంబ్లీ పరిధిలో వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం ఎస్ బి అంజాద్ భాష, కాంగ్రెస్ అభ్యర్థిగా అఫ్జల్ ఖాన్ పోటీలో ఉన్నారు. ప్రొద్దుటూరు అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పూల మహమ్మద్ నజీర్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. కడప అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,74,226 ఓట్లు ఉండగా అందులో 90 వేల ఓట్లు ముస్లిం మైనారిటీ వర్గానికి చెందినవిగా తెలుస్తోంది. కాగా రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి కడపకు చెందిన నజీర్ అహ్మద్, తంబాలపల్లి కు చెందిన ఇస్మాయిల్ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనూ..

చిత్తూరు జిల్లాలో.. అన్ని రాజకీయ పార్టీలు ముస్లీంల మద్దతు కోసం వెంపర్లాడాల్సిందే. పీలేరు 32.57 శాతం , పలమనేరులో 28.81 శాతం, మదనపల్లిలో 24.83 శాతం, పుంగనూరులో 37.30 శాతం, కుప్పంలో 14.33 శాతం రేణిగుంటలో 18.23 శాతంముస్లీం ఓటర్లు ఉన్నారు. ఈ సారి మదనపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు ప్రధాన పార్టీలు ముస్లీం అభ్యర్థులనే రంగంలోకి దించాయి. వైసీపీ నుంచి నిస్సార్‌అహ్మద్, టీడీపీ నుంచి తాజాహాన్భాషా పోటీ పడుతున్నారు.

ప్రకాశంలోనూ.. అదే స్థితి

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని స్థానిక సంస్థల ఎన్నికల్లోనే ముస్లీంలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇచ్చాయి. ఈ జిల్లాలో కనీసం నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముస్లీం ఓటు బ్యాంకు ప్రభావం ఉంటుంది. ఇప్పుడు రిజర్వేషన్ వ్యతిరేక నినాదం ముస్లీంల్లో గందరగోళం సృష్టించటం ఖాయం. బీజేపీపై వ్యతిరేక భావం పెరిగితే.. కూటమికి దెబ్బే. ఎందుకంటే కందుకూరు లో 18.84 శాతం, కనిగిరిలో 25.62 శాతం, గిద్దలూరులో 17.50 శాతం, పొదిలిలో 23.29 శాతం, సింగరాయకొండలో 25.06 శాతం, పామూరులో 23.03 శాతం,ఛంభం 35.80 శాతం ముస్లీం ఓటర్లు ఉన్నారు. ఇలాంటి స్థితిలో ప్రభుత్వ వ్యతిరేక భావనతో వైసీపీకి దూరమైన ముస్లీంలు.. బీజేపీ పుణ్యమాని పీచ్ ముడ్ అనటం ఖాయమని రాజకీయ పరిశీలకుల అంచనా. కానీ .. ముస్లీం ప్రభావిత రాష్ట్రాల్లోనూ బీజేపీ అధికారంలోకి వస్తున్న తరుణంలో.. ఏపీలోనూ ముస్లీం వ్యతిరేక నినాదం ఎంత వరకు పని చేస్తుందో ? అలవి కాని ప్రశ్నే.

# టార్పాలన్ షీట్ల కొరత.. వర్షాలకు తడుస్తున్న ధాన్యం



హైదరాబాద్,రాష్ట్ర వ్యాప్తంగా అకాల వర్షాలు, వడగళ్ల వానలు కురుస్తున్నా కొనుగోలు కేంద్రాల్లో, వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో సరిపడినన్ని టార్పాలన్ షీట్లు (ప్లాస్టిక్ పరదలు) అందుబాటులో లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారుతోంది. ప్రస్తుతం పలు జిల్లాల్లో అకాల వర్షాలకు రైతులు ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవుతోంది. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తగినన్ని టార్పలిన్ షీట్లు అందుబాటులో లేకపోవడంతోనే ధాన్యం తడుస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు.తగినన్ని టార్పలన్ షీట్లు లేకపోవడంతో పొద్దంతా ఎండబోసిన ధాన్యాన్ని కుప్పగా చేస్తున్న రైతులు తమకు అందుబాటులో ఉన్న ఫ్లెక్సీలు, పాత చీరలు కప్పాల్సి వస్తోంది. అయితే రాత్రి సమయంలో ఈదురుగాలులతో వీచే అకాల వర్షాలకు అరొకర రక్షణగా ఉన్న ఫ్లెక్సీలు ధాన్యం తడవకుండా ఆపలేకపోతున్నాయని పలు ప్రాంతాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా తగినన్ని టార్పలన్ షీట్లు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అదే సమయంలో నిబంధనల ప్రకారం 17శాతం తేమ ఉంటే ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉన్నా పలు చోట్ల 15శాతం తేమ వచ్చే వరకు ధాన్యాన్ని ఆరబోయాలని నిబంధన అమలు చేస్తుండడంతో అకాల వర్షాల బారిన తమ ధాన్యం చిక్కుకుంటోందని రైతులు వాపోతున్నారు.

మెదక్ జిల్లాలో అకాల వర్షం.. పంట నష్టం

మెదక్ జిల్లాలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షాలు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. జిల్లాలోని రామాయంపేట, చేగుంట, నార్సింగి, నిజాంపేట మండలాల్లో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి చేతికంద వచ్చిన పంట నాశనమయింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది.

చేతికొచ్చిన పంట కళ్లముందే అకాలవర్షాలకు తడిసిపోవడం, దెబ్బతినడంతో రైతులు క న్నీటి పర్యంతమవుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

రాగల రెండు రోజులు వర్షాలు

తెలంగాణలో రాగల రెండురోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. మంగళవారం నుంచి గురువారం ఉదయం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే సూచనలున్నాయని తెలిపింది. గడిచిన 24గంటల్లో కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి తదితర ప్రాంతాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైంది.

మరింత పెరగనున్న ఎండలు..

అదే సమయంలో రెండు రోజుల తర్వాత తెలంగాణలో ఎండలు మరింత పెరుగుతాయని హెచ్చరించింది. రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 36 నుంచి 42 డిగ్రీల సెంటీ-గ్రేడ్ వరకూ నమోదవుతాయని తెలిపింది. మరీ ముఖ్యంగా దక్షిణ తెలంగాణ, తూర్పు తెలంగాణలో ఎండలు మరింత పెరుగుతాయని హెచ్చరించింది.

# మళ్లీ బాలికలదే పైచేయి

హైదరాబాద్,తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. బుధవారం ఉదయం 11 గంటలకు నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఇంటర్ ఫలితాలను వెల్లడించారు. ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్స్‌కు సంబంధించిన ఫలితాలను ఒకేసారి విడుదల చేశారు.ఫస్టియర్‌లో 60.01 శాతం, సెకండియర్‌లో 64.19 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ పరీక్షలకు మొత్తం 4.78 లక్షల విద్యార్థులు హాజరుకాగా.. 2.87 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ పరీక్షలకు మొత్తం 5.02 లక్షల మంది హజరవగా.. 3.22 లక్షల మంది పాసయ్యారు. ఎప్పటిలాగే ఈసారి కూడా బాలుర కంటే బాలికలదే పైచేయిగా ఉంది. బాలికల కేటగిరీలో ఫస్టియర్‌లో 68.35 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా.. బాలుర కేటగిరీలో కేవలం 51.5 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ బాలికల కేటగిరీలో 72.53 శాతం మంది ఉత్తీర్ణులు కాగా.. బాలుర కేటగిరీలో 56.1 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఇక జిల్లాల వారీగా చూసుకుంటే ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా 71.7 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో ఉండగా.. మేడ్చల్ జిల్లా 71.58 శాత ఉత్తీర్ణతతో ద్వితీయ స్థానంలో, ములుగు జిల్లా 70.01 శాతం ఉత్తీర్ణతతో తృతీయ స్థానంలో నిలిచాయి. అదేవిధంగా సెకండ్ ఇయర్ ఫలితాల్లో 82.95 శాతం ఉత్తీర్ణతతో ములుగు జిల్లాకు ప్రథమ స్థానం, 79.31 శాతం ఉత్తీర్ణతతో మేడ్చల్ జిల్లాకు ద్వితీయ స్థానం, 77.63 శాతం ఉత్తీర్ణతతో రంగారెడ్డి జిల్లాకు తృతీయ స్థానం దక్కాయి.

# అభివృద్ధికి ఆటంకం

న్యూఢిల్లీ,ప్రపంచ జనాభాలో అత్యధికంగా ఉన్న దేశంగా భారత్ రికార్డులకు ఎక్కింది. చైనాను వెనక్కి నెట్టి 144 కోట్ల జనాభాతో మనం ముందు వరసలో నిలబడ్డాం. ఇది అభివృద్ధికి సూచిక కాదని గుర్తించాలి. వెనకబడి పోవడానికి..ఆర్థికంగా మరిందగా దెబ్బతినడానికి సూచికగా గుర్తించాలి. కొన్ని దేశాల్లో జనాభా పెరిగింది. కొన్ని దేశాల్లో జన సంఖ్య తగ్గుముఖం పట్టింది. వృద్ధుల సంఖ్య పెరిగి, యువ జనాభా తగ్గడం కూడా ఆందోళన కలిగించే విషయమే. తక్కువ భూభాగం కలిగి ..ఎక్కువ జనాభాతో బాధపడే దేశాలు అభివృద్ధిని సాధించలేవని ఈ సందర్భంగా పాలకులు గుర్తించాలి. ఈ అనుభవంతో జనభా నియంత్రణకు మనం నడుం బిగించకపోతే.. అధోగతి పాలవుతామని గుర్తించాలి. ఇలా జనాభా పెరుగుతూ పోతుంటే.. ఎంతగా పంటలు పండించినా తిండిగింజలు దొరకవు. అలాగే నిరుద్యోం పెరుగుతుంది. అధిక జనాభాతో బాధపడే దేశాల్లోని ప్రజలకు అన్ని సదుపాయాలూ కల్పించడం కష్టం. ఈ కారణంగానే చాలా దేశాలు వెనకబడే ఉంటున్నాయి. వాస్తవ పరిస్థితులను ప్రభుత్వాలు, ప్రజలు అర్థం చేసుకోవాలి. జనాభాను తగ్గించుకుని, పేదరికాన్ని పారదోలాలి. లింగ వివక్షతను రూపు మాపి, సమానత్వాన్ని, మానవత్వాన్ని మెరుగు పరచి మానవ హక్కులను కాపాడాలి. ఇందుకు అనుగుణంగా జనాబా నియంతరణకు ఎవరికి వారు పాటుపడాలి. ఆధునిక ప్రపంచంలో చాలా గ్రామాల్లో తాగునీరు లేక వ్యాధుల బారిన పడుతున్నారు. నగరాలన్నీ మురికి కూపాలుగా మారిపోతున్నాయి. కుటుంబ పోషణార్థం బాలలు వెట్టిచాకిరీ వైపు పయనిస్తున్నారు. బాలకార్మిక వ్యవస్థ పురుడు పోసుకోవడానికి ఆర్థిక లేమి కారణమౌతున్నది. విద్యా సౌకర్యాలు లేక, పట్టించుకునే వారు కరువై వీధి బాలలుగా మారే వారి సంఖ్య ప్రస్తుత ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో పెరిగే అవకాశముంది.జనాభా పెరుగుదల వలన కలిగే దుష్పరిణామా లను క్యరాజ్యసమితి దశాబ్దాల క్రితమే కార్యాచరణ ప్రారంభించింది. పలు ప్రపంచ దేశాలు సైతం చేతనైన ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా, ప్రపంచ ప్రజల, ప్రభుత్వాల ఆలోచనా విధానంలో మార్పు రాకపోతే ఫలితం శూన్యం. కాబట్టి జనాభా పెరుగుదల వలన కలిగే విపత్కర పరిణామాలపై ప్రజల్లో నిరంతర చైతన్యం కలిగించాలి. 800 కోట్లకు చేరువలోనున్న ప్రపంచ జనాభాకు అన్ని వసతులు సమకూర్చవలసిన బాధ్యత వాటిపై ఎంతైనా ఉంది. ఇప్పటికే అడవులను, పచ్చని భూములను ధ్వంసం చేసి, పర్యావరణాన్ని నాశనం చేసేశారు. దాని ఫలితాలను ప్రజలు చవిచూస్తున్నారు. సరైన వసతి లేదు. ఆహార భద్రత లేదు. విద్యా వైద్య సదుపాయాలు గగన కుసుమంలా మారాయి. జనాభాను గణనీయంగా తగ్గించుకునే అవకాశాలను ఆచరించాలి. జనాభాలో వృద్ధుల శాతం పెరుగడటంతో చైనా వన్ చైల్డ్ విధానానికి వీడ్కోలు చెప్పింది. ఇద్దరు పిల్లలను కనేందుకు జంటలకు అనుమతి ఇచ్చింది. ఇస్లామిక్ విప్లవం తర్వాత ఇరాన్‌లో జనాభా విస్ఫోటనం జరిగింది. కాని ప్రస్తుతం జనాభా తగ్గుముఖం పడుతున్నది. ఇటలీ జనాభా తరిగిపోయి, వృద్ధులు పెరిగిపోతున్నారు. జపాన్ జనాభాలో సగం మంది వృద్ధులు వుండే అవకాశాలున్నాయి. భారత జనాభా చైనాను అధిగమిస్తుందని అంచనా ఇప్పుడు నిజమయ్యింది. జన విస్ఫోటనం మధ్య మానవాళి ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆహార, ఆవాస, తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంలో ప్రపంచమంతా అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రపంచ దేశాలన్నీ నిర్దిష్టమైన ప్రణాళిక, కార్యాచరణతో సమిష్టి తత్వంతో ముందుకు సాగాలి. అందుకు ఏ దేశం ఆ దేశం కార్యాచరణ చేయాలి. ఇందులో భారత ప్రభుత్వం ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలి. జనాభా నియంత్రణ అన్నది జాతీయ కార్యాచరణ కావాలి. ప్రజలను చైతన్యం చేయడంతో పాటు..బలవంతంగా నియంత్రణ పద్ధతులు అవలంబిచేలా చేయాలి. లేకుంటే దేశంలో ఆర్థిక సంక్షోభం బద్దలు కాగలదు.

## బిజెపి అధికారంలోకి వస్తే రిజర్వేసన్ల రద్దు

తిరుపతి,బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని మార్చేస్తుందని,ఎస్సీ , ఎస్టీ , ఓబీసీ , మైనార్టీలకు రిజర్వేషన్లు రద్దవుతాయని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రల పట్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చింతామోహన్ సూచించారు. సొంత రాజ్యాంగం కోసం మోడీ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు తమ ఓటు హక్కుతో బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు. భారతదేశం ఏమైపోతుందోనన్న ఆందోళన అన్ని వర్గాల్లో వ్యక్తమవుతోందన్నారు, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టుతో బీజేపీ పతనం ప్రారంభమైందని, ఈసారి బీజేపీ ప్రతిపక్ష స్థానానికి పరిమితమవుతుందని అన్నారు. మేకప్ లేనిదే మోదీ బయటకు రారని, ఆయన మేకప్ ఖర్చురోజుకు రూ.20 వేలు అవుతుందని చింతామోహన్ అన్నారు. రాష్ట్రంలోని టీడీపీ , వైసీపీ పార్టీలు మోదీ, అమిత్ షా జేబులోకి వెళ్లిపోయాయని విమర్శించారు. రాబోయే పదిహేను రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయని, ఆంధ్రప్రదేశ్ ప్రజలు, దేశ ప్రజలు విజ్ఞతతో, వివేకంతో, ఆలోచించి ఓటు వేయాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఓటు వేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు అనుకూల గాలి వీస్తోందన్నారు. కాంగ్రెస్ కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చింతామోహన్ అన్నారు. రైతుల పండించే పంటలకు మద్దతు ధర కోసం చట్టం చేస్తామని, ప్రతి నిరుపేద మహిళలకు ఉచితంగా సంవత్సరానికి లక్ష రూపాయలు ఇస్తామని ప్రకటించారు.

# కేంద్రం సాయం అందించినా అభివృద్ధి శూన్యం



విశాఖపట్నం, ఏపీ అభివృద్ధికి అన్ని రకాలుగా కేంద్రం సహకరిస్తుంటే ఇక్కడ అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం మాత్రం లెక్కకు మించి అప్పులు చేసిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. అప్పుల కారణంగా అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. విశాఖలో మేధావులతో జరిగిన సమావేశంలో ఎన్డీయే కూటమి ఎంపీ అభ్యర్థి భరత్, ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్ రాజులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కూడా వైకాపా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. వైకాపా ప్రభుత్వం మొత్తం రూ. 13.50లక్షల కోట్ల అప్పులు చేసి.. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తిపై రూ.2లక్షల రుణభారం మోపింది. ఖజానా ఖాళీ చేసి పన్నుల భారం ప్రజల మీద వేసింది. రాష్ట్రాన్ని, విశాఖను డ్రగ్స్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌గా మార్చిందని మండిపడ్డారు. ల్యాండ్, హ్యూమన్ ట్రాఫికింగ్, మైనింగ్ మాఫియాలు రాష్ట్రంలో స్వైర విహారం చేస్తున్నాయి. జగన్ ప్రభుత్వం అవినీతి ఆరోపణలతో పూర్తిగా కూరుకుపోయింది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో అభివృద్ధికి భరోసా కల్పిస్తుంది. కాంగ్రెస్ విస్మరించిన తెలుగు బిడ్డ పీవీ నరసింహారావుకు భారతరత్న ఇచ్చి తెలుగువారిపై ఉన్న గౌరవాన్ని ఎన్డీయే ప్రభుత్వం చాటి చెప్పింది. వచ్చే ఐదేళ్లలో దేశంలో జమిలి ఎన్నికలకు పూర్తిస్థాయిలో చర్యలు చేపడతాంఅని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఇకపోతే కాంగ్రెస్ ఐడియాగా చెబుతున్న 'సంపద పునఃపంపిణీ' వివాదం వేడెక్కుతున్న తరుణంలో ఆ పార్టీపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరో బాంబు వేశారు. 'మతఆధారిత జనగణన'కు సిఫారసు చేయడం ద్వారా దేశ సాయుధ బలగాల్లో చీలికకు కేంద్రంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రయత్నించాయని విశాఖపట్నంలో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచార్ కమిటీ సాయుధ బలగాల్లో మత ఆధారిత జనగణనకు 2006లో సిఫారసు చేసింది. తాజా లోక్‌సభ ఎన్నికల్లో గెలిస్తే మతపరంగా మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో సంకేతాలిచ్చింది. రెలిజియస్ మైనారిటీలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టి, సాయుధ బలగాల్లో మతఆధారిత కులగణన కూడా చేపడితే దేశ ఐక్యత, సమగ్రతకు ఎంతమాత్రం మంచిది కాదని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమం పేరుతో కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ తనకు సచార్ కమిటీ నివేదికను గుర్తుతెచ్చి ఆవేదనను కలిగించిందని అన్నారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలను రాజ్‌నాథ్ సింగ్ తప్పుపడుతూ, దొడ్డిదారిన మతఆధారిత రిజర్వేషన్లు తెచ్చేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని అన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపాన్ని బహిర్గతం చేస్తోందని చెప్పారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాలు సమాజాన్ని విడగొట్టేలా ఉన్నాయని ఆరోపించారు. ఇదే పార్టీ మతం పేరుతో దేశాన్ని విభజించిందని, అసలు బుజ్జగింపు రాజకీయాలనేవి ఆ పార్టీ డీఎన్ఏలోనే ఉన్నాయని రాజ్‌నాథ్ ధ్వజమెత్తారు. గతంలోని అవిభక్త ఆంధ్రప్రదేశ్ లో పాలన సాగించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలలో ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా 'కమ్యూనిటీ లేబొరేటరీ'ని ఏర్పాటు చేసిందని ఆయన విమర్శించారు. 2004 నుంచి 2014 వరకూ కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం రిజర్వేషన్ కోసం ఐదుసార్లు ప్రయత్నాలు చేసిందని, అయితా వారి ఎజెండా ముందుకు సాగకుండా సుప్రీంకోర్టు, ఈ దేశంలోని చట్టాలు నిలువరించాయని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు.

# ఎన్నికల మ్యాచ్ ఫిక్స్ అయిందా?




హైదరాబాద్,పార్లమెంటు ఎన్నికల్లో ఎవరు గెలిచినా ఫర్వాలేదు కానీ కాంగ్రెస్ మాత్రం ఎట్టి పరిస్థితుల్లో గెలవకూడదన్న ఉద్దేశంతో బీజేపీ, బీఆరెస్ పార్టీలు వ్యవహరిస్తున్నాయా? అన్న సందేహాలు రాజకీయ పరిశీలకుల్లో వ్యక్తమవుతున్నాయి. బీఆరెస్, బీజేపీ నేతల ప్రచార సరళి పరిశీలిస్తే ఇదే అర్థమవుతున్నదని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా బీజేపీ, బీఆరెస్ నేతలపై ఇదే రకమైన విమర్శలు చేస్తోంది. దేశంలో మూడవసారి అధికారంలోకి రావడం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న బీజేపీ ప్రత్యక్షంగా, పరోక్షంగా కాంగ్రెస్ వ్యతిరేకులందరితో జత కడుతోంది. దేశంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్న కొన్ని పార్టీలతో ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకున్న బీజేపీ, మరికొన్ని పార్టీలతో పరోక్షంగా స్నేహసంబంధాలు నెరుపుతున్నదని రాజకీయ పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. ఇందులో భాగంగానే బీజేపీ పరోక్షంగా బీఆరెస్‌తో స్నేహ సంబంధాలు కొనసాగిస్తుందన్న సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. 10 ఏళ్ల కాలం నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి, అలాగే 10 ఏళ్లుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆరెస్ కు కాంగ్రెస్ పార్టీనే మొదటి టార్గెట్ అని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఎన్నికల ప్రచారంలోఈ రెండు పార్టీలు కూడా కాంగ్రెస్‌నే టార్గెట్ చేశాయి.

**అన్యాయం చేసినా బీజేపీపై ఘాటు వ్యాఖ్యల్లేవు!**

వాస్తవంగా ఈ 10 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి తెలంగాణకు చేసిందేమీ లేదన్న విమర్శలు బలంగానే ఉన్నాయి. విభజన హామీలు మొదలుకుని, రాష్ట్రానికి ప్రాజెక్టులు కేటాయించడ వంటి విషయాల్లో అన్యాయం చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. అలాంటి బీజేపీపై కాకుండా కాంగ్రెస్ టార్గెట్‌గా విమర్శలు చేయడమంటేనే ఆ రెండు పార్టీల మధ్య రహస్య స్నేహ సంబంధాలు ఉన్నట్లు అర్థమవుతోందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శత్రువుకు, శత్రువు మిత్రుడన్న సామెతను ఈ రెండు పార్టీల నేతలు సంపూర్ణంగా అమలు చేస్తున్నారన్న అభిప్రాయం రాజకీయ పారిశీలకుల్లో వ్యక్తమవుతోంది. ఘాటు వ్యాఖ్యలు పక్కనపెడితే.. ఏదో విమర్శించాలన్న పేరుతోనే విమర్శలు ఉంటున్నాయని అంటున్నారు.

**బీఆరెస్ గెలిచేదెన్ని?**

అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయంతో బీఆరెస్ షాక్ తిన్నది. ఊహించని పరిణామంతో బీఆరెస్ నేతలు కంగుతిన్నారు. పార్టీ శ్రేణులు నైరాశ్యంలోకి వెళ్లాయి. బీఆరెస్‌లో ఉంటే భవిష్యత్తు లేదని భావించిన అనేక మంది నేతలు పార్టీ మారారు. చివరకు పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా కొంత మంది నేతలు ఆసక్తి చూపని పరిస్థితి ఏర్పడింది. బీ-ఫామ్ తీసుకున్న కడియం కావ్య కూడా పార్టీ మారి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నది. ఈ పరిణామాలతో పార్లమెంటు ఎన్నికల్లో బీఆరెస్ ఒక్కటి రెండు సీట్లైనా గెలుస్తుందా? అన్న సందేహాలు సొంత పార్టీ నేతల్లోనే వ్యక్తమవుతున్నాయన్న చర్చ జరుగుతోంది.

**బీఆరెస్ గెలవలేని చోట్ల బీజేపీకి?**

మనం గెలిచే పరిస్థితి లేనప్పుడు మన శత్రువు గెలువకుండా అడ్డుకట్ట వేయాలంటే ఏమి చేయాలన్న దిశగా బీఆరెస్ నేతలు సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు బీఆరెస్ గెలిచే స్థానాల్లో మనం ఓట్లు వేసుకోవాలి%ౌ% గెలువలేని స్థానాల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్న బీజేపీకి ఓట్లు వేయాలన్న దిశగా సమాలోచనలు జరుగుతున్నాయన్న సందేహాలు రాజకీయ వర్గాలలో వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఆ దిశగా బలంగానే లేని పలు స్థానాల్లో బీఆరెస్ ఎన్నికల ప్రచారం సరిగ్గా నిర్వహించడం లేదన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

**బీజేపీ గెలిస్తేనే బీఆరెస్ అవినీతిపై చర్యలుండవ్!**

మరో వైపు కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే కాంగ్రెస్ పార్టీ తమపై కక్షసాధింపు చర్యలు చేయకుండా, కాళేశ్వరం, ఫోన్ టాపింగ్, విద్యుత్ కొనుగోళ్లు, ధరణిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై అరెస్టులు చేయండా తదుపరి చర్యలు చేపట్టకుండా అడ్డుకోవాలంటే బీజేపీతో స్నేహం అవసరం అన్న తీరుగా బీఆరెస్ నేతలు వ్యవహరిస్తున్నారన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అందుకే ఈ రెండు పార్టీలు కాంగ్రెస్ టార్గెట్‌గానే విమర్శలు చేస్తున్నాయి కానీ, అధికారంలో ఉన్న బీజేపీని బీఆరెస్ నేతలు ఒక్క మాట కూడ అనడం లేదని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ రెండు పార్టీల మధ్య లోపాయి కారి ఒప్పందం ఉందని సామ రామ్మోహన్‌రెడ్డి అంటున్నారు.

# కులగణన హామీపై బిజెపిలో భయం



న్యూఢిల్లీ, కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన 'సామాజిక-ఆర్థిక సర్వే' హామీపై ఆ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ స్పష్టత ఇచ్చారు. దేశంలో ఎంతమందికి అన్యాయం జరిగిందనేది తెలుసుకునేందుకే సర్వే చేస్తామని తాము చెబుతున్నామని అన్నారు. సర్వే అనంతరం చర్యలు తీసుకుంటామని తాము చెప్పలేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 'సంపద సర్వే' హామీ రాజకీయంగా దుమారం రేపుతోంది. ప్రజల సంపద, నగల్ని దోచుకుని అందరికీ పునఃపంపిణీ చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టో చెబుతోందంటూ ప్రధానమంత్రి మోదీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు కూడా మోదీ విమర్శలకు దగ్గరగా ఉన్నాయనే అభిప్రాయానికి తావిచ్చింది. అమెరికాలో వారసత్వ పన్ను ఉందని, ఆ ప్రకారం ఒక వ్యక్తి మరణం తర్వాత ఆయన సంపదనలో సుమారు 45 శాతం మాత్రమే వారసులకు వెళ్తుందని, తక్కిన 55 శాతం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని, ఇది తనకు న్యాయంగానే అనిపిస్తోందని పిట్రోడా వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో 'సంపద సర్వే' హామీపై కాంగ్రెస్ వివరణ ఇచ్చింది. ఢిల్లీలో జరిగిన పార్టీ సామాజిక న్యాయ సమ్మేళన్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, సామాజిక-ఆర్థిక సర్వేతో కూడిన కులగణనకు ఎందుకు బీజేపీ వారు భయపడుతున్నారని ప్రశ్నించారు. సర్వేతో అసలు సమస్య ఏంటో, ఎక్కడుందో తెలుస్తుందని అన్నారు. తాము అధికారంలోకి రాగానే తొలి నిర్ణయం దీనిపైనే ఉంటుందన్నారు. సమాజంలో అన్యాయానికి గురవుతున్న 90 శాతం మందికి న్యాయం కల్పించడమే తమ ఉద్దేశమన్నారు. దేశంలో ఎంతమందికి అన్యాయం జరిగిందనేది తెలుసుకునేందుక సామాజిక-ఆర్థిక సర్వేతో కూడిన కులగణన ఉద్దేశమని చెప్పారు. దేశభక్తులమని చెప్పుకునే వారికి సామాజిక-ఆర్థిక సర్వేతో కూడిన కులగణన గురించి భయమెందుకని ప్రశ్నించారు. 70 ఏళ్ల తర్వాత చేపట్టనున్న కీలకమైన సర్వే ఇదని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో చూసి ప్రధానిలో ఆందోళన మొదలైందని చెప్పారు. 90 శాతం భారతీయులకు అన్యాయం జరిగిందని, దీన్ని సరిచేయాలని తాను చెప్పినప్పటి నుంచి ప్రధాని, బీజేపీ తనపై దాడి మొదలుపెట్టినట్టు చెప్పారు. కచ్చితంగా తమది (కాంగ్రెస్) రివల్యూషనరీ మేనిఫెస్టో అని రాహుల్ స్పష్టం చేశారు.

# అసలు పులివెందులలో గెలుస్తావా జగన్...



నెల్లిమర్ల : ఏపీ సిఎం జగన్ ఇవాళ కూడా అంటున్నారు 175కి 175, 25కి 25 అని. ఆ 175కి 175 మనవే ఆ 25కి 25 మనవే%ౌ% ఇప్పుడు నెల్లిమర్ల నుంచి సవాల్ విసురుతున్నా%ౌ% వై కాంట్ పులివెందుల? ఏ ముఖం పెట్టుకుని పులివెందులలో ఓటు అడుగుతావు? బాబాయ్ ని చంపావని ఓటు అడుగుతావా? నెల్లిమర్లలో ఏ ముఖం పెట్టుకుని ఓటు అడుగుతావు? రేపు గొడ్డలి పంపిస్తానని ఓటు అడుగుతావా? ఆంటూ చంద్రబాబు .సీఎం జగన్ కు సవాల్ విసిరారు.విజయనగరం జిల్లా నెలిమర్లలో ప్రజాగళం-వారాహి విజయభేరి సభకు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ చీఫ్ పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఈ సభలో చంద్రబాబు ప్రసంగిస్తూ,జగన్ రుషికొండను మింగేస్తే, ఇక్కడ ఉండే అప్పలనాయుడు ఆయనను ఆదర్శంగా తీసుకున్నాడు. మొత్తం నియోజకవర్గంలోని కొండలన్నీ మింగేసిన అనకొండ ఈ అప్పలనాయుడు" అంటూ చంద్రబాబు విమర్శనాస్త్రాలు సంధించారు. ముఖ్యమంత్రిని ఒక్క మాట అంటే పోలీసులు గోడలు దూకి వచ్చి అరెస్ట్ చేస్తారని, కానీ దేవుడి విగ్రహానికి తల తీసేస్తే ఒక్క మాట కూడా మాట్లాడరని చంద్రబాబు పోలీసులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. చివరికి ఆ విషయంలో కూడా తనపైనే కేసులు పెడతారని అన్నారు. తన మీద ఉండే 22 కేసుల్లో అది కూడా ఒక కేసు అని వెల్లడించారు."దేవుడికి అన్యాయం జరిగిందని నేను చెబితే, నాపై కేసు పెట్టి బొక్కలో వేస్తామన్నారు అదీ పిచ్చి తుగ్లక్ పరిపాలన. ఈ తుగ్లక్ ను కొనసాగిస్తారా? బస్సు యాత్రలో ఇప్పుడు ఉత్తరాంధ్రలోనే తిరుగుతున్నాడు. సవాల్ విసురుతున్నా ఉత్తరాంధ్రకు ఒక్క ప్రాజెక్టునైనా తెచ్చావా సైకో జగన్? ఒక్క సాగునీటి ప్రాజక్టునైనా పూర్తి చేశావా? యువతకు ఉద్యోగాలు ఇచ్చావా? మహిళలకు న్యాయం చేశావా? ఎవరికీ న్యాయం చేయనివాడు ఇప్పుడొచ్చి కోతలు కోస్తున్నాడునేను భోగాపురం ఎయిర్ పోర్టు తీసుకువచ్చాను. నేను ఎయిర్ పోర్టు పెట్టాలనుకుంటే విశాఖ, తూర్పు గోదావరి జిల్లా మధ్యలో పెట్టేవాడ్ని కానీ నాకు ఉత్తరాంధ్రపై ప్రేమ ఉంది. అందుకే భోగాపురంలో పెడితే ఇక్కడ్నించి ఉత్తరాంధ్రకు ముఖద్వారం అవుతుందని భావించాను. తద్వారా పరిశ్రమలు వస్తాయి, మీకు ఉపాధి లభిస్తుందని ఆశించాను. నేను అధికారంలో ఉంటే ఈ పాటికి భోగాపురం పూర్తయ్యేది. 2750 ఎకరాల భూసేకరణ చేసి, శంకుస్థాపన చేశాను. కానీ ఈ సైకో జగన్ నేను ఎక్కడైనా శంకుస్థాపన చేస్తే, దానికి మళ్లీ శంకుస్థాపన చేస్తాడు పనిమాత్రం పూర్తి చేయడు.నేనుంటే 2021కే భోగాపురం పూర్తయ్యేది. ఇప్పుడు హామీ ఇస్తున్నా ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును 2025కి పూర్తి చేస్తాను. ఒక ఎయిర్ పోర్టు వస్తే పరిశ్రమలు వస్తాయి, పరిశ్రమలు వస్తే పిల్లలకు ఉద్యోగాలు ఇస్తాయి.జగన్ కు ఇంకా దింపుడు కల్లం ఆశలు పోలేదు. ఇవాళ శ్రీకాకుళంలో మీటింగ్ పెట్టాడు%ౌ% క్వార్టర్ బాటిల్ ఇచ్చాడు, బిర్యానీ ప్యాకెట్లు ఇచ్చాడు, రూ.500 ఇచ్చాడు%ౌ% ఎంత ఇచ్చినా ఇక్కడి మన మీటింగ్ కు వచ్చినంత జోష్ జగన్ మీటింగ్ కు వస్తుందా? ఇవాళ నెల్లిమర్లలో జనసముద్రం కనిపిస్తోంది. చూసినంత మేర జనం కనిపిస్తూనే ఉన్నారు. మీకు ఒకటే హామీ ఇస్తున్నా%ౌ% ఇవాళ నేను, పవన్ కల్యాణ్, బీజేపీ కలిశాం. ఎంతో తగ్గి రాష్ట్రం కోసం నిర్ణయం తీసుకున్నాం. అధికారం కోసం కాదు%ౌ% పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కూటమిగా ఏర్పడ్డాం. సైకో పోవాలి%ౌ% రాష్ట్రం బాగుపడాలి అన్న ధ్యేయంతో పనిచేశాం. మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా. మాపై అభిమానం ఉంటే చాలదు. రేపు ఎన్నికల రోజున అభ్యర్థులను గెలిపించాలి. ఇక్కడ నెల్లిమర్ల నుంచి జనసేన పార్టీ నుంచి మాధవి పోటీ చేస్తున్నారు. గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి ఆమెను అసెంబ్లీకి పంపాలి. పవన్ కల్యాణ్ పై అభిమానం ఉండే జనసైనికులు అటు అసెంబ్లీ సెగ్మెంట్లో మాధవికి ఓటు వేసి, ఇటు పార్లమెంటు సెగ్మెంట్లో టీడీపీ అభ్యర్థికి ఓటేయాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

**మాది ప్యాకేజీ పార్టీ కాదు..ప్రజాస్వామ్య పార్టీ**

రంపచోడవరం,ప్యాకేజీ పార్టీ కాదు-సిపిఎం ప్రజాస్వామ్య పార్టీ అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గిరిజన ప్రాంత పరిరక్షణ, అభివృద్ధి కోసం ఇండియా కూటమి బలపరిచిన అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట.అప్పలనర్సకి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం దుంబ్రిగుడ మండలం పోతంగి పంచాయతీ పెద్దపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం

# వైఎస్ఆర్‌ను తిట్టిన వారికే సీఎం జగన్ పెద్దపీట వేశారు...



అమరావతి,జగన్ క్యాబినెట్‌లో ఉన్నవారందరూ వైఎస్సార్‌ను తిట్టినవారేనని, వైఎస్ఆర్‌ను తిట్టిన వారికే జగన్ పెద్దపీట వేశారని ఏపీ కాంగ్రెస్? ఛీఫ్? షర్మిల అన్నారు. ఇవాళ ఆమె రేపల్లె నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బొత్స సత్యనారాయణ అసెంబ్లీలో వైఎస్సార్‌ను తిట్టిపోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు."ఇదే బొత్స వైఎస్సార్‌ను త్రాగుబోతు అని తిట్టాడు. ఇదే బొత్స జగన్‌కు ఉరి శిక్ష వేయాలని అన్నాడు. జగన్ మోహన్ రెడ్డి బినామీలు అన్నాడు. విజయమ్మను సైతం అవమాన పరిచాడు. ఇలాంటి బొత్స జగన్‌కు తండ్రి సమానులు అయ్యారు" అంటూ ఎద్దేవా చేశారు. వీళ్ళందరూ జగన్ తండ్రులు, అక్కలు, చెల్లెల్లు.. నిజంగా ఆయన కోసం పని చేసిన వాళ్ళు ఈయనకు ఏమి కారు అని అన్నారు.జగన్ కోసం పాదయాత్రలు చేసిన వాళ్ళు ఏమి కారు. ఆయన కోసం పని చేసి గొడ్డలి పోటుకు గురైన వాళ్ళు ఏమి కారు. వైఎస్ఆర్‌సీపీ పార్టీ పేరులో వైఎస్ఆర్ లేదు.. %% అంటే %ఎ% సుబ్బారెడ్డి,%ా% అంటే సాయి రెడ్డి ,%=% అంటే రామకృష్ణా రెడ్డి" అని వైఎస్ఆర్‌సీపీకి కొత్త అర్థం చెప్పారు. 10 ఏళ్లలో రేపల్లె లో అభివృద్ధి జరిగిందా ?, ఏ వర్గానికి అయినా న్యాయం జరిగిందా ? అని షర్మిల ప్రజలను ప్రశ్నించారు."సీఎం జగన్ ఇక్కడకు వచ్చారట.. హామీలు ఇచ్చారట.. చెక్ డ్యాం లు కట్టి లక్ష ఎకరాలకు సాగునీరు ఇస్తామన్నారట.. 100 పడకల ఆసుపత్రి అన్నారట.. అక్వా రైతుల కోసం ఆక్వా పార్క్ అన్నారట.. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామని చెప్పారట.. షిప్పింగ్ హార్బర్ కడతాం అన్నారట. కానీ ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదు ఈ సీఎం జగన్" అంటూ వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శలు గుప్పించారు.

# రాయబరేలిలో ప్రియాంక దిగితే...వరుణ్‌ను రెడీ చేసిన బిజెపి అధిష్టానం

లక్నో, ఉత్తరప్రదేశ్‌లోని హై ప్రొ÷ల్ సీట్లలో ఒకటైన రాయ్‌బరేలీ నుంచి ఎవరు పోటీ చేస్తారనే విషయాన్ని అటు కాంగ్రెస్ గానీ, ఇటు బీజేపీగానీ ఇంకా వెల్లడించలేదు. అయితే ప్రియాంక గాంధీ రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

ఈ నేపథ్యంలో ప్రియాంకకు పోటీగా నెహ్రూ-గాంధీ కుటుంబానికి చెందిన వరుణ్‌గాంధీని ఎన్నికల బరిలోకి దించాలని బీజేపీ నిర్ణయించింది. రాయ్‌బరేలీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసేందుకు వరుణ్‌గాంధీకి బీజేపీ తాజాగా ఆఫర్ ఇచ్చిందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే వరుణ్ తన సోదరి ప్రియాంకా గాంధీపై ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో నిర్ణయం తీసుకునేందుకు కొంత సమయం అడిగారని సమాచారం. రాయ్‌బరేలీ అభ్యర్థుల ప్యానెల్‌లో వరుణ్ గాంధీ పేరును కూడా బీజేపీ కేంద్ర నాయకత్వం చేర్చినట్లు సమాచారం. రాయ్‌బరేలీ సీటు కాంగ్రెస్‌కు కంచుకోటగా పేరొందింది. ఈసారి సోనియా గాంధీ రాజ్యసభకు వెళ్లడంతో ప్రియాంక గాంధీ ఇక్కడి నుంచి పోటీ చేస్తారనే ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వరుణ్‌గాంధీని రంగంలోకి దించితే కాంగ్రెస్‌కు గట్టిపోటీ ఎదురవుతుందని బీజేపీ అంతర్గత సర్వేలో వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే వరుణ్ గాంధీని ఇక్కడి నుంచి పోటీచేయించేందుకు బీజేపీ రంగం సిద్ధం చేసింది. ఒకవేళ వరుణ్ గాంధీ రాయ్ బరేలీ నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తే, గాంధీ కుటుంబ సభ్యులు ఒకరిపై ఒకరు పోటీ చేయడం 40 ఏళ్ల తర్వాత జరుగుతున్నట్లవుతుంది. 1984 లోక్‌సభ ఎన్నికల్లో వరుణ్ గాంధీ తల్లి మేనకా గాంధీ అమేథీ నుంచి రాజీవ్ గాంధీపై పోటీ చేశారు. అప్పట్లో ఆమె ఓటమిని ఎదుర్కొన్నారు. ఆ తరువాత మేనకా గాంధీ, సోనియా గాంధీ కుటుంబాలు పరస్పరం ఎన్నికల్లో పోటీకి దిగలేదు. ప్రస్తుతం యూపీలోని సుల్తాన్‌పూర్ స్థానం నుంచి మేనకా గాంధీ మరోసారి ఎన్నికల బరిలోకి దిగారు.

# తలసేమియా రహిత తెలంగాణపై నిరంతర వైద్య విద్య ...



హైదరాబాద్: హైదరాబాద్‌లో తలసేమియా రహిత తెలంగాణ, తలసేమియా నివారణ - ఒక అడుగు దూరంలో అనే అంశంపై దృష్టి సారించే నిరంతర వైద్య విద్య (సీఎంఈ) కార్యక్రమం కోసం ప్యానలిస్టులు, విశిష్ట అతిథులు, వైద్య నిపుణులు సమావేశమయ్యారు. టీఎస్ సీఎస్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ తన ప్రారంభ ఉపన్యాసంలో, కార్యక్రమానికి హాజరైన అతిథులకు స్వాగతం పలకడం పట్ల తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రఖ్యాత గైనకాలజిస్ట్‌లు అండ్ ప్రసూతి వైద్యుల హాజరు గురించి ఆయన వెల్లడించారు.తెలంగాణను తలసేమియా రహితంగా మార్చడానికి చేస్తున్న సమిష్టి కృషిలో వారి కీలక పాత్రను వెల్లడించారు. డాక్టర్ అగర్వాల్ కార్యక్రమ ఇతివృత్తం ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. తలసేమియా ముగింపు కేవలం ఒక అడుగు దూరంలో ఉందని వెల్లడించారు. వెయ్యి మైళ్ల ప్రయాణం ఒక్క అడుగుతోనే మొదలవుతుందన్న చైనీస్ సామెతను స్ఫూర్తిగా తీసుకుని, ఈ లక్ష్యం వైపు చేసే ప్రయాణంలో వేసే ప్రతి అడుగు ప్రాముఖ్యతను ఆయన ఎత్తిచూపారు. డాక్టర్ అగర్వాల్ ఈ జన్యుపరమైన రుగ్మతను ఎదుర్కోవడంలో నివారణ చర్యల సౌలభ్యత, సమర్థతను వివరిస్తూ.. తలసేమియా నివారణ కేవలం ఒక అడుగు దూరంలో ఉందనే మంత్రాన్ని పునరుద్ఘాటించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com